ప్రజా గళమే
# స్పంద
SPANDHA NEWS
జాతీయ తెలుగు దినపత్రిక
Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106



## మూడు బ్రేకప్స్.. ఆసుపత్రి పాలయ్యా

తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపారు. చిన్నతనంలో కలిగిన మొదటి క్రష్‌ను తాను సీరియస్‌గా తీసుకోలేదని, అయితే రెండో రిలేషన్‌షిప్ మాత్రం తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. వరుస బ్రేకప్స్ వల్ల తీవ్ర ఒత్తిడికి గురై బరువు గణనీయంగా 52 కిలోలకు తగ్గిపోయానని, ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

8




మంగళవారం || 6-10-2026 || సంపుటి: 1 || సంచిక: 62 || పేజీలు: 8 || వెల : రూ.5/- Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal



## ఆ రికార్డులను సమర్పించండి

ఈసీ నిర్ణయాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశం

4



## చట్టవిరుద్ధంగా ఫామ్-6 మార్పులు

సుప్రీం వ్యాఖ్యలతో సీఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

4

## వైద్య విభాగంలో ముగ్గురికి నోబెల్

ఆప్టోజెనెటిక్స్‌లో విప్లవాత్మక పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

కార్ల్ డైసెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌కు సంయుక్తంగా అవార్డు



4



## ప్రతి కుటుంబానికి సురక్షిత జలాలు

### 3 కోట్ల మందికి జలధార!

- ప్రొద్దుటూరులో పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- 'అమరజీవి జలధార' పైలాన్‌ను ఆవిష్కరించిన చంద్రబాబు, పవన్
- రూ. 30 వేల కోట్లతో 27 లక్షల ఇళ్లకు కొత్త కుళాయిలు
- రాయలసీమలో లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్
- గోదావరి పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం
- స్థానిక సంస్థల్లోనూ కూటమి సర్కార్ రావాలని పిలుపు

**ప్రొద్దుటూరు (స్పంద న్యూస్):** "రాష్ట్రంలో 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం.. ప్రతి ఇంటికీ కుళాయి ఇచ్చి మహిళల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గం కొత్తపల్లిలో శనివారం ఆయన, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి రూ. 30,136 కోట్ల వ్యయంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార' పైలాన్‌ను ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 24,601 ఆవాసాల్లోని 27 లక్షల కుటుంబాలకు కొత్తగా తాగునీటి కనెక్షన్లు ఇస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, 77,243 కిలోమీటర్ల మేర పైపులైన్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తామన్నారు. తద్వారా మొత్తం 61.60 లక్షల కనెక్షన్ల ద్వారా 3.3 కోట్ల మందికి సురక్షితమైన తాగునీరు అందుతుందని వివరించారు. కేంద్రం నిధులు ఇస్తున్నా.. గత ప్రభుత్వం తాగునీటి పథకానికి కేవలం రూ. 2,600 కోట్లు మాత్రమే

మిగతా 2లో..

## 5 లక్షల మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం!



- సెర్ప్, మెప్మా అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేలా శిక్షణ, మార్కెటింగ్
- వ్యాపార నిర్వహణ కోసం ఐఐఎం సంస్థలతో భాగస్వామ్యం
- విజయవాడలో 15 నుంచి 31 వరకు 'నేషనల్ సరస్ మేళా'

"రాష్ట్రంలో కోటికి పైగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలపడితే.. కోటి కుటుంబాలకు పైగా బలపడినట్టే.. అందుకే 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మనం పనిచేయాలి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

వివరాలు 2లో..

## హైకోర్టు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

- ఏపీ హైకోర్టులో ఐదుగురు జడ్జీల నియామకం
- తొలి కోర్టు హాల్‌లో బాధ్యతల స్వీకరణ
- కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ
- శుభాకాంక్షలు తెలిపిన ఇతర న్యాయమూర్తులు









రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఏపీ హైకోర్టుకు కొత్తగా ఐదుగురు శాశ్వత న్యాయమూర్తులు నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో.. కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు.



వివరాలు 3లో..

## జగన్ జీవనయానం 'స్థితప్రజ్ఞుడు'

తాడేపల్లి ఆఫీసులో ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం

ఒడిదుడుకులు ఎదురైనా స్థిరచిత్తంతో నిలిచారన్న సజ్జల



3



## శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- అదనపు రద్దీకి అనుగుణంగా లాజిస్టిక్స్, భద్రతా ఏర్పాట్లు
- టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

2



## సిట్ కస్టడీకి కారుమూరి

హైదరాబాద్ జైలు నుంచి విజయవాడకు తరలింపు

ఏపీ మద్యం రవాణా స్కామ్‌లో వేగవంతమైన దర్యాప్తు

3

## కూటమి పాలనలోనే సీమకు మహర్దశ

- రాళ్లు తేలిన సీమలో ఇప్పుడు పరిశ్రమలు
- స్థానికంగానే ఉపాధి అవకాశాలు
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత



వివరాలు 2లో..




## ఏపీ స్పెషల్ టెట్ హాల్ టికెట్లు రిలీజ్

68 వేల మంది టీచర్లకు పరీక్షలు

అక్టోబర్ 11 నుంచి 21 వరకు ఎగ్జామ్స్

2

## రామాయపట్నం రిఫైనరీకి గ్రీన్ సిగ్నల్!

- బీపీసీఎల్ రిఫైనరీకి నిపుణుల కమిటీ పచ్చజెండా

2






2

## 2029 నాటికి బడులన్నీ 4-స్టార్!

నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 'లీప్' స్కూళ్లు

విద్యాశాఖ అధికారులకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 6 అక్టోబర్ 2026

# కూటమి పాలనలోనే సీమకు మహర్దశ!

**రాళ్లు తేలిన సీమలో ఇప్పుడు పరిశ్రమలు**

**యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు**

**'పల్లె పండుగ'తో మారుమూల గ్రామాలకు రోడ్లు**

**జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత**



**ప్రొద్దుటూరు (స్పంద న్యూస్):** "సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంతో పాటు రాయలసీమ అన్ని రంగాల్లోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.. ఒకప్పుడు రాళ్లు తేలిన రాయలసీమ నేడు 'రైజింగ్ సీమ'గా ఆవిర్భవిస్తోంది" అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రొద్దుటూరులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించిన 'అమరజీవి జలధార' ప్రాజెక్టు సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. సీమ జిల్లాలను పారిశ్రామిక, ఇంధన హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇటీవలే రూ. లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ పనులకు శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు. సూపర్ సిక్స్ సహా పలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామని వివరించారు. 'పల్లె పండుగ' పేరుతో రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో సైతం రహదారుల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఇప్పుడు రూ. 30 వేల కోట్లతో 'అమరజీవి జలధార' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ ప్రాజెక్టుతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రోజుకు 55 లీటర్ల పరిశుద్ధమైన నీటిని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి అంకురార్పణ చేసిందని మంత్రి సవిత వెల్లడించారు.

# రామాయపట్నం రిఫైనరీకి గ్రీన్ సిగ్నల్!

**లక్ష కోట్లకు పైగా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం**

**బీపీసీఎల్ రిఫైనరీకి నిపుణుల కమిటీ పచ్చజెండా**

**ఐదు వేల ఎకరాల్లో భారీ పెట్రోకెమికల్ కాంప్లెక్స్**

**ఏటా తొమ్మిది మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు**

**వేలాది మందికి లభించనున్న ఉపాధి అవకాశాలు**

**అమరావతి (స్పంద న్యూస్):** రాష్ట్రంలో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు కీలక ముందడుగు పడింది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) పచ్చజెండా ఊపుతూ సిఫారసు చేసింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. సుమారు రూ. 1,03,408 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రామాయపట్నం పోర్టు సమీపంలో దాదాపు 5,200 ఎకరాల భూమిని కేటాయించారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని నిర్మిస్తారు. ఇందులో 5.4 మిలియన్ టన్నుల పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనాలతో పాటు 3.2 మిలియన్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయాలన్నది ప్రధాన లక్ష్యం. అనుమతుల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభించేందుకు బీపీసీఎల్ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మొత్తం ప్రాంగణంలో 30 శాతం.. అంటే సుమారు 1,563 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయనున్నారు. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కోసమే ప్రత్యేకంగా రూ. 3,022 కోట్లు కేటాయించారు. వీటితో పాటు గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన జోన్లు, రామాయపట్నం పోర్టుతో అనుసంధానించిన మెరైన్ క్రూడ్ ఆయిల్ టెర్మినల్ కూడా ఈ ప్రాజెక్టులో భాగం కానున్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రూపురేఖలు మారనున్నాయని, దక్షిణ భారతదేశంలోనే ఇది ఒక ప్రధాన ఇంధన, పెట్రోకెమికల్ హబ్‌గా ఎదగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో వేలాది మందికి, ఆ తర్వాత నిర్వహణ దశలోనూ వేల సంఖ్యలో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# ఏపీ స్పెషల్ టెట్-2026 హాల్ టికెట్లు రిలీజ్!

**68 వేల మంది టీచర్లకు పరీక్షలు**

**అక్టోబర్ 11 నుంచి 21 వరకు ఎగ్జామ్స్**

**అమరావతి (స్పంద న్యూస్):** రాష్ట్రంలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం నిర్వహించనున్న స్పెషల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)-2026 హాల్ టికెట్లు విడుదలయ్యాయి. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టెట్ కన్వీనర్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు.. 2011కు ముందు నియమితులై, టెట్ అర్హత లేని ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక పరీక్షను నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 68,420 మంది టీచర్లు దీనికోసం దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో (సీబీటీ) ఆన్‌లైన్‌లోనే ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ రెండు సెషన్లలో ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. మొదటి సెషన్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో తమ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి హాల్ టికెట్ పొందాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ వివరాలు మర్చిపోయినట్లయితే 'నో యువర్ యూజర్ ఐడీ' లేదా 'ఫర్గాట్ పాస్‌వర్డ్' ఆప్షన్ల ద్వారా వాటిని తిరిగి పొందే వెసులుబాటు కల్పించారు. కాగా, ఈ పరీక్షలో సాధించిన అర్హత కేవలం ప్రస్తుత సర్వీసు కొనసాగింపు, ప్రమోషన్లకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల అనంతరం అక్టోబర్ 24న ప్రాథమిక కీ, నవంబర్ 10న తుది కీ విడుదల చేసి.. నవంబర్ 15వ తేదీన తుది ఫలితాలను ప్రకటించనున్నారు.

# ప్రతి కుటుంబానికి సురక్షిత జలాలు

(మొదటి పేజీ తరువాయి..)

ఖర్చు చేసి నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనలో మంత్రి పవన్ కల్యాణ్ తనదైన ముద్ర చూపిస్తున్నారని ప్రశంసించారు. "రాయలసీమ ఉత్థానాన్ని ఎవరాపినా ఆగదు.. ఈ ప్రాంత దశదిశ మార్చేలా రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టాం" అని చంద్రబాబు ప్రకటించారు. సీమలో పండే ఫలాలు అంతర్జాతీయ మార్కెట్లకు 'రాయలసీమ బ్రాండ్'తో ఎగుమతి అవుతాయన్నారు. రాబోయే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. ఏరోస్పేస్, రక్షణ రంగ ప్రాజెక్టులతో భవిష్యత్తులో యుద్ధ విమానాలు సైతం రాయలసీమలోనే తయారు కానున్నాయని చెప్పారు.

**దొంగ పనులే వారి సిద్ధాంతం..**

ప్రతిపక్షాన్ని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన చంద్రబాబు.. అరాచకం, దొంగ పనులు చేయడమే ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. వివేకా హత్య కేసులో రూ. 40 కోట్ల సుపారీ వ్యవహారం బయటపడిందని, మద్యం కుంభకోణంలో వేల కోట్ల దోపిడీ వెనుక ఉన్న లబ్ధిదారు ఎవరో ప్రజలకు తెలుసన్నారు. గ్రూప్-1 పేపర్లను అటెండర్లతో దిద్దించి నిరుద్యోగులను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. నేరాలు చేసి తప్పుడు ప్రచారం చేయడం వారి నైజం అన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల్లోనూ కూటమి సర్కార్ ఉంటేనే అభివృద్ధి సాధ్యమని.. రాయలసీమకు రప్పారప్పా రాజకీయం కాకుండా పరిశ్రమలు, ఉపాధి అవసరమని సీఎం పిలుపునిచ్చారు. ఈ సభలో మంత్రులు సవిత, నారాయణ, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



# 5 లక్షల మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం!

- **సెర్ప్, మెప్మా అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం**
- **డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేలా శిక్షణ, మార్కెటింగ్**
- **వ్యాపార నిర్వహణ కోసం ఐఐఎం తదితర సంస్థలతో భాగస్వామ్యం**
- **విజయవాడలో 15 నుంచి 31 వరకు 'నేషనల్ సరస్ మేళా'**



**అమరావతి (స్పంద న్యూస్):** "రాష్ట్రంలో కోటికి పైగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలపడితే.. కోటి కుటుంబాలకు పైగా బలపడినట్టే.. అందుకే 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మనం పనిచేయాలి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మహిళలు సంపద సృష్టించేలా, వారికి ఎక్కడ ఎలాంటి అవకాశాలు ఉన్నా వినియోగించుకునేలా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సెర్ప్, మెప్మా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. దేశంలోనే స్వయం సహాయక సంఘాలు అంతటి విస్తృతమైన వ్యవస్థ మరొక్కటి లేదని సీఎం ఈ సమీక్షలో ప్రస్తావించారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న వేలాది ఉత్పత్తులకు ఒకే బ్రాండ్, నాణ్యత ప్రమాణాలు, ఆధునిక ప్యాకేజింగ్, ఈ-కామర్స్ వ్యవస్థలను అనుసంధానం చేస్తూ 'స్వయం ఏపీ'ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌కు చేరుకునేలా కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. లక్ష మంది మహిళలు ఏడాదికి రూ. 5 లక్షల చొప్పున వ్యాపారం చేయగలిగితే.. రూ. 5,000 కోట్ల ఆర్థిక సామర్థ్యం సాధించినట్టేనని సీఎం లెక్కలు వివరించారు.

**15న రాష్ట్రపతితో సరస్ మేళా ప్రారంభం..**

మహిళా సాధికారతను దేశానికి చాటేలా విజయవాడలో ఈనెల 15 నుంచి 31 వరకు నిర్వహించ తలపెట్టిన 'నేషనల్ సరస్ మేళా-2026'ను ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ మేళా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న మహిళా పారిశ్రామికవేత్తలను, మహిళా ఎంపీలను ఆహ్వానించనున్నారు. ఈ మేళాలో దేశం నలుమూలల నుంచి వచ్చే స్వయం సహాయక సంఘాలు సుమారు 600 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నాయని, రోజూ లక్ష మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

**ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయాలు.. ప్రతిష్టాత్మక సంస్థలతో భాగస్వామ్యం..**

అక్టోబర్ 15 నుంచే సిగ్నేచర్ స్టోర్లతో పాటు ఫ్లిప్‌కార్ట్ ద్వారా 'స్వయం ఏపీ' ఉత్పత్తుల విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ఐఐఎం విశాఖపట్నం, సెంచూరియన్ యూనివర్సిటీ లాంటి 60కి పైగా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. రూ. 68,585 కోట్ల రుణాలతో వారికి ఆర్థిక మద్దతు ఇస్తున్నామని చెప్పారు. స్త్రీనిధి ద్వారా 4.73 లక్షల మంది మహిళలకు రూ. 4,800 కోట్ల రుణాలు అందించామన్నారు. ఇప్పటికే ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆహారం, హస్తకళలు, వస్త్రాల తయారీలో 23,000కు పైగా ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం!

**అదనపు రద్దీకి అనుగుణంగా లాజిస్టిక్స్, భద్రతా ఏర్పాట్లు**

**సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలి**

**వాహన సేవల వీక్షణకు అనుకూలంగా పటిష్టమైన చర్యలు**

**టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర**



**తిరుమల (స్పంద న్యూస్):** "వరుస సెలవులు, పెరటాసి మాసం నేపథ్యంలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు గతంతో పోలిస్తే సుమారు 25 నుంచి 30 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉంది.. ఈ అదనపు రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాలు పక్కాగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి" అని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర అధికారులను ఆదేశించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈవోలు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు.

**సాలకట్ల స్ఫూర్తితో సమన్వయం..**

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరిగిన తొమ్మిది రోజుల సాలకట్ల బ్రహ్మోత్సవాలను భక్తులకు అనుకూలంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. పోలీసు, జిల్లా యంత్రాంగం, టీటీడీ విభాగాలు సమన్వయంతో పనిచేయడమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. ఇదే సమన్వయ స్ఫూర్తిని రాబోయే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి, ఎక్కడైనా చిన్నచిన్న లోటుపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని, అవి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పారిశుధ్యం, అన్నప్రసాదంపై ప్రత్యేక దృష్టి..**

భక్తుల సౌకర్యం, భద్రతకే టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఈవో స్పష్టం చేశారు. లాజిస్టిక్స్, అన్నప్రసాదం, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం, రవాణా, పుష్ప, విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎస్వీబీసీ ప్రసారాలు, పోలీసుల భద్రతా ఏర్పాట్లపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించారు. భక్తులు ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకుని, వాహన సేవలను వీక్షిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పొందేలా అన్ని విభాగాలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. భక్తులందరూ తిరుమలకు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో పిలుపునిచ్చారు.



# 2029 నాటికి బడులన్నీ 4-స్టార్!

- **ఏడాదిలోగా జీరో-స్టార్ స్కూళ్లకు వన్-స్టార్ రేటింగ్**
- **నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 'లీప్' స్కూళ్లు**
- **ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల బడులపై ప్రత్యేక దృష్టి**
- **విద్యాశాఖ అధికారులకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం**

**అమరావతి (స్పంద న్యూస్):** "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు.. 2029 నాటికి వాటన్నింటినీ 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మనం పనిచేయాలి" అని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**నియోజకవర్గానికి ఒక 'లీప్' స్కూల్..**

ఏడాది వ్యవధిలోగా రాష్ట్రంలోని జీరో-స్టార్ రేటింగ్ ఉన్న స్కూళ్లన్నింటినీ వన్-స్టార్‌కు, అలాగే వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ.. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 'లీప్ స్కూళ్లను' అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. డీఈవోలు, ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించి.. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో కంప్యూటర్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు.

**5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ..**

అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని లోకేష్ సూచించారు. పీఎంకేవీవై పథకం ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిరుద్యోగ యువతను 'నైపుణ్యం పోర్టల్' పరిధిలోకి తీసుకొచ్చి, ఏఐ (హా×) సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంకాప్ ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 6 అక్టోబర్ 2026

# జగన్ జీవనయానం 'స్థితప్రజ్ఞుడు'!

- తాడేపల్లి ఆఫీసులో ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం
- ఒడిదుడుకులు ఎదురైనా స్థిరచిత్తంతో నిలిచారన్న సజ్జల
- నాయకత్వ లక్షణాలు, ప్రజానుబంధాన్ని ఆవిష్కరించిన పుస్తకం
- రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మకు అభినందనలు



**తాడేపల్లి (స్పంద న్యూస్):** "వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదురైనా స్థిరచిత్తంతో ముందుకు సాగారు.. ఆయన నాయకత్వ శైలి, దృఢత్వం ఈ పుస్తక శీర్షిక 'స్థితప్రజ్ఞుడు'లోనే స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.." అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం సీనియర్ జర్నలిస్ట్, టెక్నోక్రాట్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయ ప్రస్థానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఒక రాజకీయ నాయకుడి ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను, తీసుకున్న సాహసోపేత నిర్ణయాలను, ప్రజలతో ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఇలా పుస్తక రూపంలో భద్రపరచడం భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జగన్ రాజకీయ ప్రస్థానంలోని కీలక మైలురాళ్లను ఒకేచోట చేర్చి పాఠకులకు అందించడం గొప్ప ప్రయత్నమన్నారు. రాజకీయ చరిత్రను కేవలం సంఘటనల సమాహారంగా మాత్రమే చూడకూడదని, వాటి వెనుక ఉన్న పరిస్థితులు, నాయకత్వ దృక్పథం, ప్రజలతో ఉన్న సంబంధాలను కూడా నిష్పాక్షికంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందని సజ్జల అభిప్రాయపడ్డారు. ఆ దిశగా రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ఈ పుస్తకం పాఠకుల ఆదరణను విశేషంగా పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత, నాయకులు ఎంవీఎస్ నాగిరెడ్డి, కొవ్వూరి త్రినాథరెడ్డి, చల్లా మధుసూదన్ రెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసులో మౌనం నేరాంగీకారమే

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శలు

**అమరావతి, అక్టోబర్ 05:** సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు. ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప



ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

**అమరావతి, అక్టోబర్ 05:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.





# లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ

అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు. ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.



# హైకోర్టు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

- ఏపీ హైకోర్టులో ఐదుగురు జడ్జిల నియామకం
- తొలి కోర్టు హాల్‌లో బాధ్యతల స్వీకరణ
- కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ
- శుభాకాంక్షలు తెలిపిన ఇతర న్యాయమూర్తులు

**అమరావతి (స్పంద న్యూస్):** రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఏపీ హైకోర్టుకు కొత్తగా ఐదుగురు శాశ్వత న్యాయమూర్తులు నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో.. కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా ఉన్న ఐదుగురు సోమవారం శాశ్వత జడ్జీలుగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ వేడుకకు ఏపీ హైకోర్టులో సేవలందిస్తున్న ఇతర గౌరవనీయ న్యాయమూర్తులందరూ హాజరై, తమ సహచర జడ్జీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు, న్యాయశాఖ అధికారులు విశేషంగా పాల్గొన్నారు.

# సిట్ కస్టడీకి మాజీ మంత్రి కారుమూరి!

- హైదరాబాద్ జైలు నుంచి విజయవాడకు తరలింపు
- ఏపీ మద్యం రవాణా స్కామ్‌లో వేగవంతమైన దర్యాప్తు
- ఈ నెల 9వ తేదీ వరకు అధికారుల విచారణ
- కుమారుడు, కోడలి ఖాతాల్లోకి 85 శాతం స్కామ్ డబ్బు

**విజయవాడ (స్పంద న్యూస్):** "ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కుమారుడికి సబ్ కాంట్రాక్ట్ ఇప్పించడంతో పాటు భారీగా అక్రమాలకు పాల్పడిన వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరుపుతాం.." అని స్పష్టం చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న కారుమూరిని సోమవారం విజయవాడకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం.. ఈ నెల 9వ తేదీ వరకు ఆయనను కస్టడీలో ఉంచుకుని విచారించనున్నారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు అడుగులు వేస్తున్నారు. మరోవైపు ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా ఉన్న సమయంలో కారుమూరి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు సునీల్‌కు ఇప్పించారని ఈడీ దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం ప్రత్యేకంగా 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం నేరుగా ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి జమ అయినట్లు ఈడీ పక్కా ఆధారాలు సేకరించింది. ఈ అక్రమ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణకు, వాహనాలకు డీజిల్ ఖర్చులకు, ఇతర ప్రయాణాలకు వినియోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈడీ దర్యాప్తులో వెల్లడైన ఈ సంచలన అంశాలపై మరింత వివరాలు రాబట్టేందుకే సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నిస్తున్నారు.



# అంబటి రాంబాబుకు నోటీసులు

**అమరావతి, అక్టోబర్ 05:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.



ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక



# ఆ రికార్డులను మాకు సమర్పించండి..

## ఈసీ నిర్ణయాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశం

- ఫారం-6ను ఎవరు మార్చారో పరిశీలిస్తామన్న సీజేఐ ధర్మాసనం
- జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్లపై నోటీసులు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన కీలక నిర్ణయాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా తీసుకున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక విచారణ చేపట్టింది. వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన అధికారిక రికార్డులను తమ ముందుంచాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు ఎవరు చేశారు? ఆ నిర్ణయానికి పూర్తి ఎన్నికల కమిషన్ ఆమోదం ఉందా? అనే అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలిస్తామని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ, వివేక్ జోషితోపాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఆరోపణలపై ముందుగా ప్రామాణిక సమాచారం, అధికారిక రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది.

### 'ఫారం-6 మార్పులకు మేం ఆమోదం ఇవ్వలేదు'

విచారణలో ఫారం-6 అంశంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా ఉపయోగించిన సవరించిన ఫారం-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందన్న వాదనపై సీజేఐ స్పష్టత ఇచ్చారు. సవరించిన ఫారం-6కు తాము ఆమోదం ఇవ్వలేదని, రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాత ఎవరు, ఏం మార్చారన్నది పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయాలు చట్టంలో నిర్దేశించిన సామూహిక నిర్ణయ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ వాదించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య ఏ అంశంపైనైనా అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ అభిప్రాయం ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని చట్టం చెబుతోందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను పక్కనపెట్టి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారన్నది పిటిషనర్ల ప్రధాన ఆరోపణ. అయితే ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానం నిర్ధారించిన వాస్తవాలు కావు.

### 'రికార్డులు చూశాకే నిర్ణయం'

జ్ఞానేశ్‌కుమార్‌ను తక్షణమే సీఈసీ విధుల నుంచి తప్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వికాస్‌సింగ్ కోరగా ధర్మాసనం అందుకు అంగీకరించలేదు. మీడియా కథనాలు, ఆరోపణల ఆధారంగా ఏకపక్షంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ముందుగా ఎన్నికల కమిషన్‌తోపాటు ప్రతివాదుల వాదనలు వినాలని స్పష్టం చేసింది. అయితే అధికారిక రికార్డుల పరిశీలనలో ఏదైనా నిర్ణయం చట్టబద్ధమైన ప్రక్రియకు విరుద్ధంగా తీసుకున్నట్లు తేలితే దానిని రద్దు చేసే అధికారం న్యాయస్థానానికి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో ఫారం-6లో మార్పులు ఎలా జరిగాయి? వాటికి ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ ఆమోదం ఉందా? ఇద్దరు ఎన్నికల కమిషనర్లు నిజంగానే అభ్యంతరాలు నమోదు చేశారా? అన్న అంశాలపై ఈసీ సమర్పించే అధికారిక రికార్డులు ఇప్పుడు కీలకంగా మారనున్నాయి.



# ఉగ్రవాదుల చేతిలో 'లోరా'..

# సైన్యానికి కొత్త సవాల్!

## సిమ్ లేదు.. సెల్ టవర్ లేదు.. వైఫైతోనూ పనిలేదు

### కశ్మీర్ అడవుల్లో 'ఘోస్ట్ నెట్‌వర్క్'తో ఉగ్రవాదుల రహస్య సంభాషణలు

**శ్రీనగర్, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** సిమ్ కార్డు ఉండదు.. మొబైల్ టవర్‌తో పనిలేదు.. వైఫై అవసరం లేదు.. అయినా కిలోమీటర్ల దూరంలో ఉన్న సహచరులతో రహస్యంగా సమాచారాన్ని పంచుకోవచ్చు. జమ్మూకశ్మీర్ అడవుల్లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగిస్తున్న భద్రతా బలగాలకు ఇప్పుడు 'లోరా' పేరుతో కొత్త సాంకేతిక సవాల్ ఎదురైంది. 'లాంగ్ రేంజ్, లో పవర్' రేడియో కమ్యూనికేషన్ ఆధారిత పరికరాలను ఉగ్రవాదులు వినియోగిస్తున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌పై ఆధారపడకపోవడంతో సంప్రదాయ ట్రాకింగ్ వ్యవస్థలకు వీటిని గుర్తించడం కష్టమవుతోందని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల బద్గాం జిల్లా ఎన్‌కౌంటర్‌లో లష్కరే తయ్యిబా కీలక కమాండర్ ఆసిఫ్ హతమయ్యాడు. అతడి వద్ద స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా 'లోరా అల్ట్రా' పేరుతో ఉన్న ప్రత్యేక పరికరం లభించినట్లు భద్ర తా వర్గాలు వెల్లడించాయి. ఇది సాధారణ వాకీటాకీ కాదని, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్‌కు ఉపయోగించే పరికరమని పేర్కొన్నాయి. హాషిం మూసా సెప్టెంబర్ 29న బద్గాంలో జరిగిన ఆపరేషన్‌లో హతమైనట్లు సైనిక వర్గాలను ఉటంకిస్తూ తాజా కథనాలు పేర్కొన్నాయి.

### అడవుల్లో కనిపించని సమాచార వలయం

తక్కువ శక్తితో పనిచేసే రేడియో ఫ్రీక్వెన్సీల ఆధారంగా ఈ పరికరాలు సమాచారాన్ని ప్రసారం చేస్తాయి. భద్రతా వర్గాల ప్రకారం అడవి ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో టెక్స్ట్ సందేశాలు, జీపీఎస్ లొకేషన్లు, అత్యవసర సంకేతాలను పంపే సామర్థ్యం వీటికి ఉంది. ఒక పరికరం నుంచి మరో పరికరానికి సంకేతాలను చేరవేస్తూ ప్రైవేటు కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండటంతో ఉగ్రవాదులకు దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే 'లోరా' పరికరాలను గుర్తించడం అసాధ్యం అనడం సరికాదు. సాధారణ మొబైల్ ట్రాకింగ్‌తో పోలిస్తే వీటిని గుర్తించడం క్లిష్టమైనప్పటికీ, ప్రత్యేక రేడియో ఫ్రీక్వెన్సీ పర్యవేక్షణ ద్వారా సంకేతాలను గుర్తించే అవకాశముంది. గతంలో ఆపరేషన్ మహదేవ్ సమయంలో అత్యంత ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ పరికరం సిగ్నల్‌ను భద్రతా బలగాలు గుర్తించి ఉగ్రవాదుల స్థావరాన్ని చేరుకున్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. స్వాధీనం చేసుకున్న పరికరాలు భారత్‌లో అసెంబుల్ చేసినట్లు కనిపించడం లేదని, ముందుగానే కాన్ఫిగర్ చేసి ఎన్‌క్రిప్ట్ చేసిన స్థితిలో సరిహద్దు అవతలి నుంచి చేరి ఉండొచ్చని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. వీటి వెనుక పాకిస్థాన్ సరఫరా వ్యవస్థ, చైనా సాంకేతికతకు సంబంధం ఉండొచ్చన్న కోణాన్నీ సంస్థలు పరిశీలిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే పాక్-చైనా సంబంధం ఇప్పటివరకు బహిరంగంగా నిర్ధారితమైన అంశం కాదు; భద్రతా సంస్థల పరిశీలనలో ఉన్న అనుమానంగానే చూడాలి. ఈ కొత్త సమాచార వ్యవస్థను ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలు తమ ఎలక్ట్రానిక్ నిఘా సామర్థ్యాలను మార్చుకుంటున్నాయి. అడవుల్లో లోరా రేడియో ఫ్రీక్వెన్సీలను గుర్తించేందుకు స్పెక్ట్రమ్ స్కానర్లు, జామర్లను తిరిగి సర్దుబాటు చేస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి.

# చట్టవిరుద్ధంగా ఫామ్-6 మార్పులు..

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ గాంధీ ధ్వజం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫామ్-6లో మార్పులను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా చేశారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేయడంతో రాహుల్ గాంధీ స్పందించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన ఫామ్-6లో చేసిన మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. 'మార్చిన ఫామ్-6లో ఏదీ మేం ఆమోదించలేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఫామ్-6ను ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను కోర్టు కోరింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు చేశారు. ఫామ్-6ను ఆయన చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ తన పదవిని దుర్వినియోగం చేసి బీజేపీకి ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంలో భాగమైన వారందరినీ బాధ్యులను చేస్తామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకున్నవా, లేక ఒక్క సీఈసీ మాత్రమే నిర్ణయించారా అనే వివరాలను కోర్టు కోరింది.

# కాంతితో మెదడుకు కళ్లెం..

## వైద్య విభాగంలో ముగ్గురికి నోబెల్

### ఆప్టోజెనెటిక్స్‌లో విప్లవాత్మక పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

### కార్ల్ డైసెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌కు సంయుక్తంగా అవార్డు



**స్టాక్‌హోమ్, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** వైద్యశాస్త్రంలో విప్లవాత్మక పరిశోధనలకు గుర్తింపుగా 2026 సంవత్సరానికి ముగ్గురు శాస్త్రవేత్తలను నోబెల్ పురస్కారం వరించింది. అమెరికాకు చెందిన కార్ల్ డైసెరోత్, జర్మనీ శాస్త్రవేత్తలు పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌లకు వైద్యశాస్త్రం లేదా శరీరధర్మశాస్త్ర విభాగంలో సంయుక్తంగా నోబెల్ ప్రకటించారు. కాంతికి స్పందించే అయాన్ చానళ్లు, ఆప్టోజెనెటిక్స్ రంగాల్లో వీరు చేసిన ఆవిష్కరణలకు గుర్తింపుగా స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ నోబెల్ కమిటీ సోమవారం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ ముగ్గురికి మొత్తం 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్ల నగదు బహుమతిని అందజేయనున్నారు.

### కాంతితో నాడీకణాల నియంత్రణ

మెదడు పనితీరును అర్థం చేసుకోవడంలో ఆప్టోజెనెటిక్స్ సాంకేతికత కొత్త అధ్యాయానికి నాంది పలికింది. కాంతిని ఉపయోగించి మెదడులోని నిర్దిష్ట నాడీకణాలను ఉత్తేజితం చేయడం లేదా వాటి కార్యకలాపాలను నిలిపివేయడం ఈ పద్ధతి ప్రత్యేకత. పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్ ఏకకణ శైవలాల్లో కాంతికి స్పందించే 'చానల్ రోడాప్సిన్' అనే ప్రోటీన్‌ను గుర్తించారు. నీలి కాంతి పడినప్పుడు ఈ ప్రోటీన్‌లోని చానల్ తెరుచుకుని విద్యుత్ ఆవేశం కలిగిన అయాన్లు కణంలోకి ప్రవేశిస్తాయని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డైసెరోత్ మరింత ముందుకు తీసుకెళ్లారు. చానల్ రోడాప్సిన్‌కు సంబంధించిన జన్యువును నాడీకణాల్లో ప్రవేశపెట్టి, కాంతి సాయంతో వాటి కార్యకలాపాలను నియంత్రించవచ్చని చూపించారు. 2005లో నాడీకణాల్లో ఈ ప్రయోగాన్ని విజయవంతంగా ప్రదర్శించిన ఆయన, ఆ తర్వాత జీవించి ఉన్న ఎలుకల మెదడులోనూ ఈ పద్ధతిని అమలు చేశారు. ఈ పరిశోధనలే ఆప్టోజెనెటిక్స్ అభివృద్ధికి పునాదులయ్యాయి. జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, కదలికలు, ప్రవర్తన వంటి ప్రక్రియల్లో మెదడులోని ఏ నాడీకణాలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో తెలుసుకునేందుకు ఆప్టోజెనెటిక్స్ శక్తివంతమైన సాధనంగా మారింది. పార్కిన్సన్స్, మూర్ఛ, అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధులతోపాటు మానసిక రుగ్మతలపై పరిశోధనలకు ఈ పద్ధతి ఉపయోగపడుతోంది. దృష్టిలోపం ఉన్నవారికి కొంతమేర చూపును పునరుద్ధరించే చికిత్సల అభివృద్ధిలోనూ దీనిని పరిశీలిస్తున్నారు. అయితే పలు చికిత్సాపరమైన వినియోగాలు ఇంకా పరిశోధన దశలోనే ఉన్నాయి. 1901లో ప్రారంభమైన వైద్యశాస్త్ర నోబెల్ పురస్కారాన్ని ఈ ఏడాదితో కలిపి 117 సార్లు ప్రకటించారు. ఇప్పటివరకు 235 మంది ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వైద్యశాస్త్ర నోబెల్ అందుకున్న అత్యంత పిన్న వయస్కుడు ఫ్రెడరిక్ బాంటింగ్. ఇన్సులిన్ ఆవిష్కరణకు చేసిన కృషికి 1923లో ఆయన 32 ఏళ్ల వయసులో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అత్యధిక వయసులో వైద్య నోబెల్ అందుకున్న వ్యక్తి పేటన్ రౌస్. 1966లో ఆయన 87 ఏళ్ల వయసులో ఈ అవార్డును స్వీకరించారు.

# నేరస్తుల గుండెల్లో భయం పుట్టాలి

- అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు సీరియస్
- ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** దేశ రాజధానిలో మహిళలు, బాలికలపై ఇటీవల వెలుగుచూసిన అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే దుండగుల మనసుల్లో భయం పుట్టేలా పోలీసుల చర్యలు ఉండాలని స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడానికే పరిమితం కాకుండా.. నేరం జరగకుండా నిరోధించడమే పోలీసుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొంది. మహిళలు రాత్రి వేళల్లోనూ రోడ్లపై నడిచేటప్పుడు, ప్రజా రవాణాను ఉపయోగించేటప్పుడు సురక్షితంగా ఉన్నామనే భావన కలిగే పరిస్థితి ఉండాలని వ్యాఖ్యానించింది. ఢిల్లీ--ఎన్‌సీఆర్‌లో ఇటీవల జరిగిన అత్యాచారాలు, లైంగిక దాడుల ఘటనలను సుమోటోగా స్వీకరించిన కేసును జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆస్తా కుంజ్ పార్కులో 17 ఏళ్ల బాలికపై జరిగినట్లు ఆరోపిస్తున్న సామూహిక అత్యాచారం సహా పలు ఘటనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు సెప్టెంబర్ 28నే ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది. మహిళలు, చిన్నారులు హింస భయం లేకుండా గౌరవంగా జీవించే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో అంతర్భాగమని కోర్టు పేర్కొంది. పోలీసుల పెట్రోలింగ్, నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా ఉండాలని ధర్మాసనం పేర్కొంది. పార్కులు, బస్‌స్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో భద్రతను బలోపేతం చేయాలని గత విచారణలోనే ఆదేశించింది. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడంతోపాటు అక్కడ లైటింగ్, సీసీటీవీ వ్యవస్థలను తనిఖీ చేసి లోపాలను సరిచేయాలని స్పష్టం చేసింది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిలో చట్టమంటే భయం కలిగేలా పోలీసుల ఉనికి, చర్యలు ఉండాలని తాజా విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేవలం నేరం జరిగిన తర్వాత కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడం కాకుండా, ముందస్తు నిఘాతో నేరానికి అవకాశమే లేకుండా చేయాలని సూచించింది. అయితే పెట్రోలింగ్ పేరుతో పోలీసులు అతిగా వ్యవహరించకూడదన్న అంశాన్నీ కోర్టు ప్రస్తావించింది. పార్కులు, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోనే బాధ్యత ముగిసిపోదని ధర్మాసనం అభిప్రాయపడింది. కెమెరాల్లో నమోదయ్యే దృశ్యాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఉండాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. అనుమానాస్పద కదలికలను గుర్తించిన వెంటనే క్షేత్రస్థాయి పోలీసులను అప్రమత్తం చేసే విధానం అవసరమని పేర్కొంది. ఢిల్లీ పోలీసుల్లో ఖాళీలు, సిబ్బంది అందుబాటు అంశాలను అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది లిజ్ మాథ్యూ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సమర్థవంతమైన పెట్రోలింగ్‌కు తగిన సిబ్బంది, శిక్షణ కూడా కీలకమని విచారణ సందర్భంగా చర్చ జరిగింది. సెప్టెంబర్ 28న ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపై మిగిలిపోకుండా వాస్తవంగా అమలవుతున్నాయా అన్నదే తమకు ముఖ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొలి ఉత్తర్వుల్లోనూ ప్రకటించిన పథకాలు ఎంతవరకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయో సమగ్ర స్థితిగతుల నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక

మంగళవారం, 6 అక్టోబర్ 2026

## చేనేత కుటుంబాన్ని ఆదుకున్న పీవా

అధ్యక్షులు జీవిఎస్ రామకృష్ణ



**తెనాలి అక్టోబర్05(స్పంద న్యూస్) :** ఆపదలో ఉన్న కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చేయూతనిచ్చింది. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని ప్రకటకోటయ్యనగర్‌లో చేనేత కుటుంబానికి చెందిన పడ వల సీతారామయ్యకు పక్షవాతం రావడంతో అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి లోనవటంతో ఆ కుటుంబం కష్టాలను ఎదుర్కొంటుంది.ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వి.ఎస్. రామకృష్ణ వెంటనే స్పందించి తమ తెనాలి కమిటీ ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, బాపట్ల జిల్లా సెక్రెటరీ దీపాల వెంకట కోటి నాగేశ్వరరావు ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక చేయూతనందించారు. వారితో పాటు సీనియర్ జర్నలిస్టు బోడా సుధాకర్, పోలిశెట్టి వెంకటేశ్వరరావు,దీపాల శ్రీని వాసరావు ఉన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ హనీఫ్



తెనాలి, అక్టోబర్05(స్పంద న్యూస్) : సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుర్రిపాలెంగ్రామం లోని సబ్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన ఉచిత మెడికల్ క్యాంపునిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ ఈ మెడికల్ క్యాంప్ నందు గర్భిణీ స్త్రీలకు పరీక్షలతో పాటు సామాన్య ప్రజలకు బిపి మధుమేహం వంటి పరీక్షలు ఉచితంగా చేసి తగు మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన మరియు స్క్రీనింగ్ కార్యక్రమాలు కూడా చేస్తున్నామని , క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ఉచితంగా కళ్లెపరీక్షతోపాటు, క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితం గా మందులు ఇవ్వడం జరుగుతుందని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని క్షయ వ్యాధి అంతంలో గ్రామ ప్రజలు సహకారం ఎంతైనా అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జాగర్ల మూడి వైద్య సిబ్బంది చిన్నారి రోజా, శ్రీదేవి, ఏఎన్ఎంలు సూర్యకుమారి, , సుగుణమ్మ ఎమ్ ఎల్ హెచ్ పి లు లిల్లీ రోజా, పూజ, అంగన్వాడి టీచర్లు శ్రీలత, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## డి.ఎం.హెచ్.ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పద్మావతి

శుభాకాంక్షలు తెలిపిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు



తెనాలి,అక్టోబర్05(స్పందన్యూస్): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిఎంఅండ్ హెచ్.ఓ డాక్టర్.యమ్. పద్మావతిని గుంటూరు జిల్లా టీబీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా యూనియన్ అధ్యక్షుడు కొలికపూడి రాంబాబు, యూనియన్ సభ్యులు చాందిని, బషీర్ అహ్మద్, నాగజ్యోతి, రాజశేఖర్, స్వరూప, కౌశిక్,డాక్టర్ పల్లికొండ రవికుమార్ పాల్గొని హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపల్



యడ్లపాడు అక్టోబర్5 స్పందన్యూస్: మండలంలోని వంకాయలపాడు గ్రామపం చాయతీ పరిధిలో బోయపాలెంలోఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠ శాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలనాడు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఈనెల 3, 4 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి రైజ్లింగ్ పోటీలలో అండర్ 14, 17,19 విభాగాలలో పాల్గొన్నారు. అం డర్ 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు ఎస్ కార్తీక్, పి వినీత్, టి ఫణీంద్ర, టి యోగేంద్ర, పి చైతన్య, పి జస్వంత్ కుమార్, అండర్ 17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి బి నాగ సుభాష్, 10వ తరగతి విద్యార్థులు వై మణికంఠ కె అమ ర్నాథ్, అండర్ 19 విభాగంలో 10వ తరగతి విద్యార్థి జె సుదర్శన రావు, ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఈనెల 12వ తేదీన జరుగు స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపిక అయినారు. రైజ్లింగ్ కోచ్ నాగరాజు, పి ఈ టి రత్నాకర్, స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ డి ప్రభాకర్ రావు అభినందించారు.

# ఒక్క నిమిషంలో దసరా నవరాత్రుల పూజ టికెట్లు హాంఫట్!

## ఇంద్రకీలాద్రి దసరా టికెట్లపై భక్తుల్లో విస్మయం.





ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 5 ( స్పందన్యూస్) : విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రంలో జరిగే దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వీఐపీ టికెట్లు, పూజా టికెట్లు బుకింగ్ 5 వా తేది సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన కొద్ది సమయంలోనే పూర్తిగా బుక్ కావడం భక్తుల్లో చర్చనీయాంశంగా మారింది. టికెట్ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భక్తులు బుకింగ్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్‌లో ప్రయత్నించినప్పటికీ, ఒక్క నిమిషంలోనే టికెట్లు అందుబాటులో లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని పలువురు భక్తులు చెబుతున్నారు.

**అసలు ఏం జరుగుతోంది?**

టికెట్ల బుకింగ్ ప్రారంభమయ్యే సమయాన్ని ముందుగానే తెలుసుకుని, వేలాది మంది భక్తులు ఒకేసారి ప్రయత్నించడం సహజమే. అయితే బుకింగ్ ప్రారంభించిన వెంటనే టికెట్లు పూర్తిగా అయిపోవడంతో భక్తుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఒక్క నిమిషంలో ఇన్ని టికెట్లు ఎలా బుక్ అయ్యాయి?**

**ఒకేసారి ఎంతమంది టికెట్లు బుక్ చేసుకున్నారు?**

ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు, ఆఫ్‌లైన్‌లో ఎన్ని టికెట్లు కేటాయించారు?

సాధారణ భక్తులకు అందుబాటులో ఉన్న టికెట్ల సంఖ్య ఎంత ?

బుకింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను దేవస్థానం బహిరంగంగా వెల్లడించగలదా ?

అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి చూడలేదు! "బుకింగ్ ప్రారంభించిన వెంటనే టికెట్లు అయిపోవడం మాకు ఆశ్చర్యంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఇంద్రకీలాద్రికి వస్తున్నాం. ఇంత వేగంగా టికెట్లు పూర్తవడం గతంలో చూడలేదు" అని పలువురు భక్తులు అంటున్నారు. దసరా నవరాత్రుల సమయంలో ఇంద్రకీలాద్రికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, టికెట్ల బుకింగ్ వ్యవస్థపై భక్తుల్లో నమ్మకం కలిగించేలా పూర్తి పారదర్శకత అవసరం అని వారు కోరుతున్నారు.

తిరుమల తరహాలో డిమాండ్ పెరుగుతోందా?

ఇంద్రకీలాద్రిపై పూజలు, ప్రత్యేక దర్శనాలు, వీఐపీ సేవలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో "ఇంద్రకీలాద్రి క్షేత్రం కూడా మరో తిరుమల కాబోతుందా?" అనే చర్చ భక్తుల్లో మొదలైంది.అయితే భక్తుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలంటే టికెట్ల సంఖ్య, ధరలు, కోటా, బుకింగ్ సమయం, బుకింగ్ పూర్తయిన సమయం వంటి వివరాలను దేవస్థానం స్పష్టంగా వెల్లడించడం మంచిదని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

భక్తుల డిమాండ్

టికెట్ల బుకింగ్‌పై వచ్చిన సందేహాలకు దేవస్థానం అధికారులు స్పష్టత ఇవ్వాలని, భవిష్యత్తులో సాధారణ భక్తులకు మరిన్ని టికెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

భక్తుల విశ్వాసమే దేవస్థానానికి బలం.

ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది పారదర్శకతే ఆ పారదర్శకతను ఆలయ అధికారులు, ఆలయ పాలకమండలి భక్తులకి నిరూపించుకోవాలని కోరుతున్నారు.

# పేటలో ఏపీయూడబ్ల్యూజే సాధారణ సమావేశం



చిలకలూరిపేట అక్టోబర్ 5 స్పంద న్యూస్: పట్టణంలోని అమరావతి రెసిడెన్సీలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ సాధారణ సమావేశం ఉత్సాహపూరిత వాతావ రణంలో జరిగింది. పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్,చిలకలూరిపేట అధ్యక్షులు అడపా అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సీనియర్ పాత్రికేయులు హాజరై తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించారు.

పాత్రికేయ వృత్తికి వన్నెతెచ్చేలా నడవడిక:అడపా అశోక్ కుమార్

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అడపా అశోక్ కుమార్ పాత్రికేయుల జీవనశైలి, యూనియన్ విధివిధానాలపై సూచనలు అందించారు. ముఖ్యంగా నూతనంగా జర్నలిజం రంగంలోకి అడుగుపెడుతున్న యువ విలేకరులకు ఆయన దిశానిర్దేశం చేశారు.సమాజంలో విలేకరి అంటే కేవలం వార్తలు రాసే వ్యక్తి కాదని, ప్రజల పక్షాన నిలబడేబాధ్యతాయుతమైన గొంతుక అని ఆయన గుర్తుచేశారు. నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ,వృత్తిగత విలువలు కాపాడుకుంటూ నిజాయితీగా ఎలా నడుచుకోవాలో వివరించారు.యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలిపారు.

**కష్టకాలంలో ఐకమత్యమే శ్రీరామరక్ష**

రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి షేక్ మస్తాన్ మాట్లాడుతూ విలేకరులుక్షేత్రస్థాయిలో వార్తా సేకరణలో ఎదుర్కొనే సమస్యలు, వాటిని అధిగమించే వ్యూహాలనువివరించారు. విలేకరులకు ఎటువంటి కష్టం వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని, ఐకమత్యంతో నిలబడాల్సిన విజ్ఞప్తి చేశారు.

**"ఐకమత్యమే మహాబలం"**

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఉప్పాల సుభాని,సెక్రటరీ సయ్యద్ సిద్దిక్ లు మాట్లాడుతూ "ఐకమత్యమే మహాబలం" అని ఉద్ఘాటించారు. మనలో మనంభే దాభిప్రాయాలు పక్కనపెట్టి కలిసికట్టుగా అడుగులు ముందుకు వేసినప్పుడే పాత్రికేయ వర్గానికి సమాజంలో మరింత గౌరవం, రక్షణ లభిస్తాయని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్తా రచన

పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎన్.వి.ఎస్. ప్రసాద్ వార్తా రచనలోని మెలకువలను సోదాహరణంగా వివరించారు. వార్తలు రాసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి,వాస్తవాలను నిర్ధారణ చేసుకున్న తర్వాతే వార్తను ఎలా ప్రచురించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.కేవలం సమస్యను రాయడమే కాకుండా,వాటిని సంబంధిత అధికారుల దృష్టికి పకడ్బందీగా ఎలా తీసుకెళ్లాలి, పరిష్కారం దొరికేలా ఎలా ఫాలోఅప్ చేయాలి అనే అంశాలను విశదీకరించారు.

**సమాజంలో విలేకరుల పాత్ర అత్యంత కీలకం**

**- సీనియర్ల సూచనలు**

ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులు ధూళిపాళ్ల శ్రీకాంత్, సీనియర్ పాత్రికేయులు ఆలపాటి ఆంజనేయులు, కొప్పుల కళ్యాణ్ చక్రవర్తి తదితరులు తమ సుదీర్ఘ అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో రుగ్మతలను పారద్రోలి, సానుకూల మార్పు తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్రను ఎవరూ విస్మరించలేరన్నారు. విలువలతో కూడిన జర్నలిజం ద్వారా ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు తమ అనుభవాలను నూతన విలేకరులతో పంచుకుంటూ, పత్రికా వృత్తికి భంగం కలగకుండా ప్రతి ఒక్కరూఆదర్శవంతంగా నడుచుకోవాలని ముక్తకంఠంతో తీర్మానించారు. సమా వేశం అనంతరం పలువురు పాత్రికేయులు నాయకత్వాన్ని బలపరుస్తూ ఏపీయూడబ్ల్యూజే అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# మహిళల నైపుణ్యాన్ని ఆదాయ మార్గంగా మార్చాలి

డ్వాక్రా సంఘాల బలోపేతంతో

మహిళా సాధికారతకు కృషి : మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి,అక్టోబర్05(స్పంద న్యూస్) : మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి,వారి ప్రతిభను కుటుంబ ఆదాయానికి తోడ్పడేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు, తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలి పట్టణంలో మహిళల కోసం నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. మహిళలు ఎంతో ఆసక్తితో శిక్షణ పొందుతున్న తీరును మంత్రి అభినందించారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు నాలుగు కేంద్రాల్లో సుమారు 2,050 మంది మహిళలకు 40 రోజులపాటు ఉచిత శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కుట్టుపని వంటి నైపుణ్యాలను నేర్చుకుని మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.శిక్షణ అనంతరం మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారి నైపుణ్యాన్ని స్థిరమైన ఆదాయ మార్గంగా మార్చేలా తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

40 రోజుల శిక్షణ అనంతరం కుట్టుపనిలో నైపుణ్యం సాధించిన ఒక మహిళ ప్రస్తుతం రోజుకు సుమారు 3 జాకెట్లు కుట్టి రూ.300 నుంచి రూ.400 వరకు ఆదాయం పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఇలాంటి విజయాలు మరింత మంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు.మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి, మహిళలు ఆర్థికంగా మరింత స్వావలంబన సాధించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. 2025లో రూ.100 కోట్ల రుణాల లక్ష్యాన్ని నిర్దేశించగా రూ.102 కోట్ల మేర రుణాలు అందించగలిగామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.141 కోట్ల వరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మహిళలు ఈ రుణాలను చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు, కొత్త నైపుణ్యా లు నేర్చుకునేందుకు, తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. మరో 150 మంది మహిళలకు కుట్టు మిషన్లు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేలా మరో 150 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

శిక్షణలో ప్రతిభ చూపిన మహిళలు, ఒంటరి మహిళలు, స్వయం ఉపాధి ద్వారా ముందుకు వెళ్లాలనుకునే మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కుట్టు మిషన్ అందించడం ద్వారా మహిళలకు ఒక పరికరాన్ని మాత్రమే కాకుండా, స్వయం ఉపాధికి ఒక అవకాశాన్ని, కుటుంబానికి అదనపు ఆదాయ మార్గాన్ని అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెనాలి మహిళలు తయారు చేసే జాకెట్లు, చీరలు, ఇతర ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, వాటికి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. మహిళలకు నైపుణ్యం, మహిళలకు అవకాశాలు, మహిళలకు స్వయం ఉపాధి ఇదే మహిళా సాధికారతకు బలమైన మార్గమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, మెప్మా విభాగం విజయ, అధికారులు, సిబ్బందిని మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు.

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక



# మేనింజైటిస్ దినోత్సవం పై అవగాహన కార్యక్రమం



యద్లపాడు అక్టోబర్ 5 స్పంద న్యూస్: మండలంలోని దింతెన పాడు, తిమ్మా పురం అంగన్వాడి కేంద్రాలలో మేనింజైటిస్ దినోత్స వం పై నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు వ్యాధి గురించి, పౌష్టిక ఆహారం మరియు గర్భవతి నమోదు ప్రాముఖ్యత గురించి, పిల్లల ఎదుగుదల గురించి, పిల్లలకు వచ్చే వ్యాధులు గురించి, ఇంజక్షన్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. తిమ్మాపురం అంగన్వాడీ కేంద్రం( ఎండి పల్లె)లో ప్రపంచ మేనింజైటీసు దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ వ్యాధి ప్రాణాంతకం అయినది. ఈ వ్యాధి కేవలం 24 గంటల వ్యవధిలోనే ప్రాణాలను హరించేది లేదా జీవితంలో కోలుకోలేని శారీరక మానసిక వైకల్యాన్ని కలిగించే వ్యాధి. ఈ యొక్క వ్యాధి వైకల్యంలో వినికిడి లోపం మూర్ఛ వంటివి కలుగుతాయి. సాధారణంగా ఈ వ్యాధి నవజాత శిశువులు మరియు ఐదు సంవత్సరముల లోపు ఉన్నవారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.యుక్త వయసులో వృద్ధులలో కూడా ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. లక్ష్యాలు:- ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఈ వ్యాధి ద్వారా 2030 నాటికి మూడు ప్రధాన లక్ష్యాలు నిర్దేశించుకుంది,1. బ్యాక్టీరియల్ మెనింజైటీస్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలిం చటం,2. టీకాల ద్వారా నివారించదగిన బ్యాక్టీరియల్ మెనింజైటిస్ కేసులను 50% మరియు మరణాలను70% మేరకు తగ్గించటం, 3. ఈ వ్యాధి నుండి కోలు కున్న వారిలో వైకల్యం తీవ్రతను తగ్గించి వారి జీవన పరిమాణాలను మెరుగు పరచడం, ఈ యొక్క వ్యాధిపై స్వచ్ఛంద సంస్థలు మరియు వైద్య శిబిరాలు ర్యాలీలు సోషల్ మీడియా ప్రచారాలు ఎక్కువగా కల్పించాలి.

ఈ యొక్క వ్యాధి లక్షణాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. లక్షణాలు:- ఆకస్మికంగా అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, మెడ గట్టిపడటం, వికారం వాంతులు, గందరగోళం, ఫోటో ఫోబియా, కొంత మందిలో మూర్చలు ఉండవచ్చును. ఎక్కువ నిద్రపోవటము, మేల్కోవటానికి ఇబ్బందికరంగా ఉండటం, ఆ పిల్లలలో చర్మంపై దద్దుర్లు, చిరాకు, ఏడుపు ఆహారం తీసుకోకుండా ఉండటం, తలపై ఉబ్బిన మృదువైన మచ్చలు కలిగి ఉండవచ్చును, నిదానముగా మారవచ్చును. అంగన్వాడి లో పౌష్టిక ఆహారముపై, తయారీ విధానము పై అవగాహన కల్పించినారు. తిమ్మాపురం( ఎం ఎల్ పల్లె ) అంగన్వాడీ కేంద్రంలో మెనింజై టిస్ పై మరియు పోషకాహారం పై, గర్భిణీ స్త్రీలకు, పిల్ల తల్లులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో నరేంద్ర సోను కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణ కుమారి, ఉపాధ్యక్షులు వై ప్రసాదరావు,అంగన్వాడీ కార్యకర్త టి. స్వప్న,ఆరోగ్య కార్యకర్త పి. రాణి,ఆశా కార్యకర్త సుశీల, అంగన్వాడీ కార్యకర్త బి. శాంత కుమారి,అంగన్వాడీ కార్యకర్త పీ. రాణి, ఆశా కార్యకర్త కె. అన్నమ్మ, అంగన్వాడి ఆయా పి. కళ్యాణి, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# చీకటిగోపి లాకప్‌డెత్‌కారకులను అరెస్టుచేయాలి



## గుంటూరుజిల్లా ఎస్పీఓకుల్ జిందాల్‌ను డిమాండ్ చేసిన దళిత నాయకులు

## "సిట్" ఇన్వెస్టిగేషన్ జరుగుతుంది పోలీస్ వైఫల్యం వాస్తవం అని ఒప్పుకున్న ఎస్పీ

గుంటూరు అక్టోబర్ 05 (స్పంద న్యూస్ ) : గుంటూరు జిల్లా తాడికొండ పోలీస్ స్టేషన్లో చీకటి గోపి అను దళిత యువకుడి లాకప్ డెత్ ఘటనలో సిట్ ఇన్వెస్టిగేషన్ కొనసాగుతుందని పోలీస్ వైఫల్యం వాస్తవమేనని జిల్లా ఎస్పీ ఓకుల్ జిందాల్ దళిత నాయకులతో జరిగిన సమావేశంలో ఒప్పుకున్నారు. సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఓకుల్ జిందాల్ను కలిసి తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నెకల్లు గ్రామంలో ఆటో డ్రైవర్గా జీవిస్తున్న చీకటి గోపి అనే దళిత యువకుడిని తాడికొండ సిఐ ఉమేష్, ఎస్సై జ్యోతి, మురళి అనే కానిస్టేబుల్ కొట్టి చంపిన విషయం పై దళితుల ఆందోళనలతో గుంటూరు జిల్లా ఎస్పీ ఓకుల్ జిందాల్ ఏ ఎస్ పి రవికుమార్ డి.ఎస్.పి మరో ఇద్దరు సీఐ లతో కలిపి సిట్ ఏర్పాటు చేశారు. చింతజల్లు గోపి అను మాదిగ యువకుడు నెల్లూరు ప్రసాద్ అను తెలుగుదేశం నాయకుడి ఉంగరాన్ని తీసుకొని కుదవ పెట్టుకొనగా చీకటి గోపి అను మరో మాల ఆటో డ్రైవర్ను తాడికొండ పోలీసులు చిత్రహింసలు పెట్టి హంటర్ తో కొట్టి నేల మీద కూర్చోబెట్టి బూట్ కాలుతో పురుషాంగం పై తన్న టం వలన జ్వరం వచ్చి రెండు రోజులు తర్వాత గుంటూరు హాస్పిటల్ లో గత నెల ఒకటవ తేదీన మరణించాడన్నారు. తాడికొండ సీఐ ఉమేష్ తో పాటు చీకటి గోపీని చావగొట్టిన వారిలో తెనాలిలో ముగ్గురు దళిత యువకులను సీఐ రాములు నాయక్ తో పాటు లాఠీ లతో కొట్టిన మురళి ప్రధాన కారకుడు అన్నారు. ఈ విషయం బయట వారికి చెబితే గంజాయి కేసు పెడతామని దొంగ బంగారం కేసు పెడతామని బెదిరించడంతో చింతజల్లు గోపి అను మాదిగ యువకుడు పారిపోయాడన్నారు. ఇటీవల చింతజలు గోపి ప్రత్యక్ష సాక్షి చెప్పిన సాక్ష్యం ప్రకారం వెంటనే దీచీూ 103 ఎస్సీ ఎస్టీ యాక్ట్ తాడికొండ సీఐ ఉమేష్ తదితరులపై కేసు మార్చవలసిందన్నారు. పోస్టుమార్టం రిపోర్టు కూడా తాడికొండ అధికారులు మేనేజ్ చేశారనే అనుమానం తమకుందని చీకటి గోపి శవాన్ని రీ పోస్టుమార్టం చేయించాలని దళిత నాయకులు జిల్లా ఎస్పీని డిమాండ్ చేశారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్లో గాదే సాయి కృష్ణ అను 22 కేసులు ఉన్న కాపు యువకుడు రౌడీ షీటర్ ను సీఐ నాగరాజు చంపాడనే ఆరోపణతో శవం ఆచూకీ లేకపోయినా జనసేన నాయకులను సంతృప్తి పరచటానికి సీఐ నాగరాజును కానిస్టేబుళ్లను అరెస్టు చేసి జైలుకు పంపించారన్నారు. అలాగే క్రాంతి మాదిగ కేసులో కూడా విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తమ డిమాండ్తో అదే కృష్ణలంక సీఐ నాగరాజు మీద బలన్మరణం మరియు ఎస్సీ ఎస్టీ కేసుగా మార్పు చేశారని గుంటూరు జిల్లా ఎస్పీ ఓకుల్ జిందాల్ కు వివరించారు. సిట్ రిపోర్టు రాగానే సెక్షన్లు మారుస్తామని చీకటి గోపి మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ దళిత నాయకులకు హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా ఎస్పీని కలిసిన వారిలో మంద కృష్ణ మాదిగ, కొరివి వినయ్ కుమార్, నీలం నాగేంద్రరావు, నీలాంబరం, శిఖ సురేష్, బత్తుల వీరాస్వామి, దారా అంజయ్య తదితరులున్నారు.

# గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా ఎస్. కాంతారావు బాధ్యతలు స్వీకరణ

## నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

## ప్రజలు సమస్యలను తెలియజేస్తే సంబంధిత శాఖలతో సమన్వయంతో పరిష్కరిస్తాం : డీఎస్పీ కాంతారావు



గుంటూరు, అక్టోబరు 5,(స్పంద న్యూస్ ):గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా ఎస్. కాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ను కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ విభాగానికి సంబంధించిన అంశాలపై అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించనున్నట్లు డీఎస్పీ కాంతారావు తెలిపారు.

**1995లో ఎస్ఐగా పోలీస్ శాఖలోకి**

ఎస్. కాంతారావు 1995లో ఎస్ఐగా పోలీస్ శాఖలో ఎంపికయ్యారు. అనంతరం విశాఖ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తూ పోలీసింగ్‌లో అనుభవాన్ని సంపాదించారు.

**2010లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి**

2010లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన అనంతరం విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవంతో తాజాగా 2026లో డీఎస్పీగా పదోన్నతి పొందారు.

డీఎస్పీగా పదోన్నతి అనంతరం గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా నియమితులై సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక దృష్టి**

గుంటూరు నగరంలో ట్రాఫిక్‌ను మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని డీఎస్పీ ఎస్. కాంతారావు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, వాహనాల రాకపోకలకు సంబంధించిన సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న ట్రాఫిక్ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

**ఇతర శాఖలతో సమన్వయంతో పరిష్కారం**

ట్రాఫిక్ సమస్యలకు కేవలం పోలీసు శాఖ చర్యలతోనే కాకుండా మున్సిపల్, రవాణా తదితర సంబంధిత శాఖల సమన్వయం కూడా అవసరమని డీఎస్పీ కాంతారావు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకుని సమస్యలకు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

**ప్రజలకు సురక్షితమైన ట్రాఫిక్ వ్యవస్థ**

గుంటూరు నగర ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ట్రాఫిక్ వ్యవస్థను అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తామని ఎస్. కాంతారావు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలను చేపడతామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో సమన్వయంతో పరిష్కార మార్గాలను అమలు చేస్తామని ఆయన వెల్లడించారు.

## యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు - సీఐ ఎం. మురళీ



గురజాల, అక్టోబర్ 5( స్పంద న్యూస్ ): గురజాల పరిధిలో ఇటీవల కాలంలో కొంతమంది యువత చట్టం పై అవగాహన లేకుండా గుంపులుగా ఏర్పడి ఘర్షణలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు రెండు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది అని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను, పరిస్థితిని గమనిస్తూ ఉండాలి. పిల్లలు అసాంఘిక కార్యక్రమాలకు, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడా ల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది అని తెలిపారు.యువత బుద్ధిగా ఉంటూ తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని అన్నారు.అవసరమైతే రౌడీ షీటర్ నమోదు చేయడంతో పాటు నగర బహిష్కరణ కూడా చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## ప్రత్తిపాటి పుల్లారావు కు కృతజ్ఞతలు తెలియజేసిన జమాల్ బాషా



చిలకలూరిపేట అక్టోబర్ 5 : మనసులో మాట తాము చేసిన కృషి వలన రిజిస్టర్ ఆఫీసు ప్రక్కన ఉన్న పాత గవర్నమెంట్ హాస్పటల్ ఖాళీ స్థలంలో గవర్నమెంట్ ఆసుపత్రి నిర్మా ణం కాబోతుందనిమున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకులు జమాల్ భాషా అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పాత్రికేయుల సమావేశం లో మాట్లాడారు. ఈ స్థలాన్ని ప్రవేటు వ్యక్తులకు లీజుకు ఇస్తున్నట్టు తెలుసు కున్నవెంటనే అడ్డగించినట్టు తెలిపారు. సిపిఐ పార్టీ నాయకులను కూడ గట్టుకుని తల్లిపిల్లల ఆసుపత్రి సాధన సమితి పేరుతో ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పూర్తిగా సహకరించారని, వారి ఆదేశానుసారం ఆసుపత్రి నిర్మాణం జరగబోతుందని జమాల్ భాషా వివరించారు. సహకారం అందించిన ప్రత్తిపాటి పుల్లారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సేవా సంకల్ప్ అభియాన్ భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



తెనాలి,అక్టోబర్05(స్పంద న్యూస్) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్ 2026" కార్యక్రమాల్లో భాగంగా రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలోని విశ్వవేద స్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభ, నూతన ఆలోచనా శక్తిని వెలికితీసి,2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి అవసరమైన ఆలోచనలు, అభివృద్ధి, ఆవిష్కరణలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. "సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వికసిట్ బారత్ 2047 అంశంగా క్విజ్, వ్యాసరచన "మన కళలు మన భారత్ 2047" అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా అన్ని విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందచేసారు.ఈ కార్యక్రమంలో బీజేపీ తెనాలి రూరల్ మండల ఇన్‌చార్జి కటారి వసుదేవ నాయుడు,మండల అధ్యక్షులు కడియాల నంద కిశోర్, కొత్తపల్లి యోగానంద కిషోర్, కొత్తపల్లి ప్రసాద్, డి. రవి పాల్గొన్నారు.

## వ్యవసాయ పోస్టర్ ను విడుదల చేసిన కలెక్టర్

గుంటూరు, అక్టోబర్ 5 (స్పంద న్యూస్ ):: సామూహిక ఎలుకల నియంత్రణా కార్యక్రమానికి సంబంధించిన వ్యవసాయ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున గ్రామాల్లో నిర్వహిం చాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి మాట్లాడుతూ పొలంలోను, గట్లపైన, పోరంబోకు భూములలో ఉన్న ఎలుక బొరియ లన్నింటినీ వాటిలో బ్రోమోడయోలిన్ మందు కలిపిన ఎరను ఒక్కొక్క బొరియలో 10 గ్రామాలు చొప్పున వేసి మూసివేయడం జరుగు తుందన్నారు. ఎలుకల వలన వరి పంటలో 10 నుండి 40 శాతం వరకు నష్టం వాటిల్లుతుందన్నారు. రైతులు బ్రోమోడయోలిన్ ఎలుకల మందు కలిపిన ఎరను రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా పొందవచ్చని చెప్పారు. సామూహిక ఎలుకల నియంత్రణను చేపడుదాం - వరి పంటను కాపాడుకుందాం నినాదంతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 6 అక్టోబర్ 2026



# శ్రీవారి సన్నిధిలో 'గబ్బర్'

## కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు శిఖర్ ధావన్

## ప్రత్యేక పూజలు చేసిన భారత మాజీ క్రికెటర్

**తిరుమల, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి తెల్లవారుజామున తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవలో పాల్గొన్న ఆయన.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న శిఖర్ ధావన్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపానికి చేరుకున్న ధావన్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. శిఖర్ ధావన్‌ను చూసిన భక్తులు, క్రికెట్ అభిమానులు ఆసక్తి చూపారు. భారత జట్టు తరఫున సుదీర్ఘకాలం ఓపెనర్‌గా సేవలందించిన ధావన్ అభిమానుల్లో 'గబ్బర్'గా ప్రత్యేక గుర్తింపు పొందారు.

# నికోలస్ పూరన్ విధ్వంసం

## టొరంటో సిక్సర్స్‌కు 'కెనడా సూపర్ 60' టైటిల్!

**వ్యాంకోవర్, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** కెనడా సూపర్ 60 సీజన్-2 తుదిపోరులో టొరంటో సిక్సర్స్ వీరవిహారం చేసింది. వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ మెరుపు ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ కీరన్ పొలార్డ్ ధనాధన్ బ్యాటింగ్‌తో వాంకోవర్ యాంకర్స్‌పై టొరంటో సిక్సర్స్ ఘన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో టొరంటో ఫ్రాంచైజీ సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతకుముందే జరిగిన మహిళల విభాగంలోనూ టొరంటో జట్టు విజేతగా నిలవగా, ఇప్పుడు పురుషుల జట్టు కూడా విజయం సాధించడంతో ఒకే సీజన్‌లో రెండు లీగ్ టైటిళ్లను ముద్దాడిన తొలి ఫ్రాంచైజీగా టొరంటో రికార్డులకెక్కింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన వాంకోవర్ యాంకర్స్ నిర్ణీత 60 బంతుల్లో 3 వికెట్ల నష్టానికి 164 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓబస్ పీనార్ కేవలం 21 బంతుల్లోనే 2 ఫోర్లు, 12 సిక్సర్లతో చెలరేగి అజేయంగా 82 పరుగులు చేయగా, కెప్టెన్ మొయిన్ అలీ 18 బంతుల్లో 45 పరుగులతో మెరిశాడు. అనంతరం 165 పరుగుల క్లిష్టమైన కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన టొరంటో సిక్సర్స్‌కు నికోలస్ పూరన్ ఊహించని తుఫాన్ ఆరంభాన్ని ఇచ్చాడు. మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపిస్తూ కేవలం 23 బంతుల్లోనే 2 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 291.30 అత్యధిక స్ట్రైక్‌రేట్‌తో 67 పరుగులు చేసి విజయానికి బలమైన పునాది వేశాడు. ఆ తర్వాత కెప్టెన్ కీరన్ పొలార్డ్ (13 బంతుల్లో 35), ఆఖర్లో డేనియల్ సామ్స్ (9 బంతుల్లో 25 నాటౌట్) బాధ్యతాయుతంగా రాణించడంతో సిక్సర్స్ ఇన్నింగ్స్ చివరి బంతికి లక్ష్యాన్ని ఛేధించి డ్రామాటిక్ రీతిలో టైటిల్‌ను సొంతం చేసుకుంది.



# బైబై నగోయా.. దోహాలో మళ్లీ కలుద్దాం!



**నగోయా, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** పక్షం రోజులుగా పతకాల వేట.. రికార్డుల మోత.. గెలుపోటముల ఉద్వేగాలు.. చివరి క్షణం వరకు ఉత్కంఠ రేపిన పోరాటాలు.. అన్నింటికీ తెరపడింది. జపాన్‌లోని అయిచి-నగోయా వేదికగా జరిగిన ఆసియా క్రీడలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. కళ్లు చెదిరే కాంతులు, సంగీత హోరు, జపాన్ సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరించిన ప్రదర్శనల నడుమ ఆసియా క్రీడాకారులు నగోయాకు వీడ్కోలు పలికారు. 85 పతకాలతో భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచి తన ప్రస్థానాన్ని ముగించింది.

మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో సుమారు 90 నిమిషాలపాటు జరిగిన ముగింపు వేడుకల్లో 45 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. 'ఒకే ఆసియా' ఇతివృత్తంతో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు వారాలకు పైగా సాగిన క్రీడల్లో దాదాపు 450 రికార్డులు బద్దలవగా.. వాటిలో కనీసం 50 ప్రపంచ రికార్డులు ఉండటం విశేషం.

### 85 పతకాలతో భారత్ నాలుగు

భారత క్రీడాకారులు 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచారు. 169 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలతో మొత్తం 341 పతకాలు సాధించిన చైనా వరుసగా 12వ ఆసియా క్రీడల్లోనూ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆతిథ్య జపాన్ 83 స్వర్ణాలు, 95 రజతాలు, 91 కాంస్యాలతో మొత్తం 269 పతకాలు సాధించి రెండో స్థానంలో నిలిచింది. దక్షిణ కొరియా 39 స్వర్ణాలు, 43 రజతాలు, 68 కాంస్యాలతో 150 పతకాలు సాధించి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధ్యక్షుడు షేక్ జోవాన్ బిన్ హమద్ అల్ తాని క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అథ్లెట్ల అద్భుత పోరాటాలు, చివరి క్షణాల్లో తారుమారైన ఫలితాలు, త్రుటిలో చేజారిన పతకాలు, యువ క్రీడాకారుల సంచలన ప్రదర్శనలు ఈ క్రీడలను చిరస్మరణీయంగా మార్చాయని పేర్కొన్నారు. తదుపరి ఆసియా క్రీడలకు ఆతిథ్యమిచ్చే ఖతార్ ప్రతినిధులకు బాధ్యతలను అప్పగించారు. 2030లో దోహా ఆసియా క్రీడలకు వేదిక కానుంది.



- రంగుల హరివిల్లులా ఆసియా క్రీడల ముగింపు వేడుక
- 85 పతకాలతో నాలుగో స్థానంలో భారత్
- 21 స్వర్ణాలు.. 27 రజతాలు.. 37 కాంస్యాలతో సత్తా
- 341 పతకాలతో వరుసగా 12వసారి అగ్రస్థానంలో చైనా
- మువ్వన్నెల పతాకంతో ముందుండి నడిచిన షూటర్ నీరూ దాండా



### మువ్వన్నెలతో నీరూ దాండా

ముగింపు వేడుకల్లో భారత బృందానికి ట్రాప్ షూటర్ నీరూ దాండా పతాకధారిగా వ్యవహరించారు. రెండు స్వర్ణాలు, ఒక రజతంతో మెరిసిన నీరూ.. ఆసియా క్రీడల్లో వ్యక్తిగత ట్రాప్ స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించారు. ఈసారి భారత్‌కు ఆర్చరీ పసిడి పంట పండించింది. కాంపౌండ్ విభాగంలో పురుషుల జట్టు, మిక్స్‌డ్ జట్టు, మహిళల జట్టు మూడు స్వర్ణాలు సాధించగా.. రికర్వ్‌లో మహిళల వ్యక్తిగత, మహిళల జట్టు విభాగాల్లో మరో రెండు పసిడి పతకాలు వచ్చాయి. మొత్తంగా ఆర్చరీలోనే భారత్‌కు అత్యధికంగా ఐదు స్వర్ణాలు దక్కాయి. మహిళల హాకీలోనూ భారత్ చరిత్ర సృష్టించింది. ఫైనల్లో చైనాను ఓడించి 44 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల స్వర్ణాన్ని ముద్దాడింది. 1982 తర్వాత భారత మహిళల జట్టుకు ఇదే తొలి పసిడి కాగా.. ఆసియా క్రీడల చరిత్రలో మొత్తంగా రెండో స్వర్ణం. భారత క్రీడాకారుల ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. మొక్కవోని దీక్ష, అంకితభావం, క్రీడాస్ఫూర్తితో పోటీపడిన అథ్లెట్లు దేశానికి ఆనందాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ విజయాలు భవిష్యత్తులో మరిన్ని గొప్ప ఫలితాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆకాంక్షించారు.



# విండీస్‌తో పొట్టి పోరుకు భారత్ రెడీ!

## మంగళవారం రాత్రి లక్నోలో తొలి టీ20

## శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి టీమిండియా

## అభిషేక్‌కు జోడీగా సంజూ శాంసన్‌కే మొగ్గు

## వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటుపై ఉత్కంఠ

## కుల్దీప్, అర్ష్‌దీప్ రాకతో బౌలింగ్‌కు మరింత బలం

**లక్నో, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** వన్డే సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న భారత్.. ఇప్పుడు వెస్టిండీస్‌తో పొట్టి సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి పోరు మంగళవారం రాత్రి 7 గంటలకు లక్నోలోని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియంలో జరగనుంది. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని భారత్ విజయంతో సిరీస్‌కు శ్రీకారం చుట్టాలని పట్టుదలగా ఉండగా.. చివరి వన్డేలో గెలిచిన ఉత్సాహంతో వెస్టిండీస్ బరిలోకి దిగుతోంది. తొలి మ్యాచ్‌లో భారత తుది జట్టు ఎలా ఉండబోతోందన్నదే ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కుతుందా? లేక అభిషేక్ శర్మ-సంజూ శాంసన్ జోడీనే ఓపెనింగ్ చేస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్యలను బట్టి చూస్తే వైభవ్ తన అవకాశం కోసం మరికొంత కాలం వేచి చూడాల్సి రావచ్చునే సంకేతాలు కనిపిస్తున్నాయి. జట్టు ఎంపిక సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఒత్తిడి ఆధారంగా కాకుండా.. జట్టు సమతుల్యత, ఆటగాళ్ల నిలకడ ఆధారంగానే ఉంటుందని గంభీర్ స్పష్టం చేశారు.







### సంజూకే తొలి ఛాన్స్?

అభిషేక్ శర్మకు ఓపెనర్‌గా చోటు దాదాపు ఖాయంగా కనిపిస్తుండగా.. అతడికి జోడీగా సంజూ శాంసన్ దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మధ్యవరుసకు బలం చేకూర్చనున్నారు. శివమ్ దూబే, అక్షర్ పటేల్, నితీశ్‌కుమార్ రెడ్డి రూపంలో భారత్‌కు అష్టపదార్థుల బలం ఉంది. అయితే అధికారిక తుది పదకొండు టాస్ సమయంలోనే ఖరారు కానుంది. కుల్దీప్ యాదవ్ ప్రధాన స్పిన్నర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉండగా.. అర్ష్‌దీప్ సింగ్ పేస్ విభాగానికి నాయకత్వం వహించనున్నాడు. మరో పేసర్ స్థానం కోసం ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ మధ్య పోటీ ఉండే అవకాశముంది. అధికారికంగా ప్రకటించిన 15 మంది భారత టీ20 జట్టులో శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీశ్‌కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ ఉన్నారు.

### భారత్ అంచనా తుది జట్టు

అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, నితీశ్‌కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక



## చూపులతో గుచ్చి గుచ్చి..



**ముంబై, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** గ్లామర్ ఫొటోషూట్లతో తరచూ అభిమానుల దృష్టిని ఆకర్షించే నటి ఆయేషా ఖాన్ మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ స్కూప్ నెక్ క్యామిసోల్‌లో కనిపించిన ఆయేషా.. పెయింట్ బ్రష్‌ను నోట పట్టుకుని ఇచ్చిన ఇంటెన్స్ పోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెస్సీ బన్, ముక్కుపుడకతో సింపుల్ లుక్‌ను ఎంచుకున్న ఆమె.. గోల్డెన్ లైటింగ్ మధ్య జుట్టుతో ఆడుకుంటూ కెమెరాకు పోజిచ్చారు. సహజమైన మేకప్, స్టూడియో వాతావరణం ఫొటోలకు గ్లామర్‌తో పాటు కళాత్మకమైన టచ్‌ను తీసుకొచ్చాయి. మరో ఫొటోలో ఆయేషా పూర్తి భిన్నమైన మూడ్‌లో కనిపించారు. గ్రే ప్యాంట్ ధరించి నేలపై కూర్చుని ఫొటో బుక్‌ను తిరగేస్తూ బ్లాక్ అండ్ వైట్ ఫ్రేమ్‌లో పోజిచ్చారు. ఒకవైపు బోల్డ్ లుక్.. మరోవైపు క్యాండిడ్ స్టైల్‌తో సాగిన ఈ ఫొటోషూట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆయేషా చేతిలో కొత్త సినిమా ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన లేదు. అయినప్పటికీ ఫొటోషూట్లు, సామాజిక మాధ్యమాల్లో తనదైన స్టైల్‌తో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.



# తెరపై థ్యాంక్స్ కార్డ్

### ఎమోషనల్ అయిన 'దృశ్యం 3' దర్శకుడి భార్య!

**ముంబై, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** సాధారణంగా భర్త తీసిన సినిమాను థియేటర్‌లో చూడటం ఏ భార్యకైనా సంతోషానిచ్చే విషయమే. కానీ, వెండితెరపై భర్త తనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం చూస్తే ఆ భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. సరిగ్గా అలాంటి అనుభూతినే పొంది కన్నీటి పర్యంతమయ్యారు బాలీవుడ్ నటి శివాలికా ఒబెరాయ్. తన భర్త, ప్రముఖ దర్శకుడు అభిషేక్ పాఠక్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్' (దృశ్యం 3) సినిమా చూస్తుండగా ఆమె థియేటర్‌లోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సినిమా పూర్తయ్యాక ఎండ్ టైటిల్స్ పడుతున్న సమయంలో.. దర్శకుడు అభిషేక్ పాఠక్ తన భార్య శివాలికాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ తెరపై ఓ ప్రత్యేక నోట్ వేశారు. సినిమా నిర్మాణ ప్రయాణంలో, కష్ట సమయాల్లో ఆమె అందించిన నిరంతర మద్దతును అందులో గుర్తుచేసుకున్నారు. బిగ్ స్క్రీన్‌పై ఆ థ్యాంక్స్ కార్డ్‌ను చూసి ఉద్వేగానికి లోనైన శివాలికా, ఆ క్షణాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. "తెరపై ఆ నోట్ చూడగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ సినిమా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు మనం ఎన్నో త్యాగాలు చేశాం, తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నాం. రోజుల తరబడి ఒకరికొకరం దూరంగా గడపాల్సి వచ్చింది. కానీ నీ పనితనంపై నాకు మొదటినుంచీ పూర్తి నమ్మకం ఉంది. ఈ రోజు నీ కష్టాన్ని ప్రపంచమంతా మెచ్చుకుంటుంటే ఆ శ్రమ అంతా మర్చిపోయాను. భవిష్యత్తులో మన కూతురు 'ఆరికా' కూడా ఈ సినిమా చూసి నిన్ను చూసి గర్వపడుతుంది. నీలాంటి వ్యక్తికి భార్యనైనందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని శివాలికా తన పోస్టులో భావోద్వేగంగా రాసుకొచ్చారు. కాగా, అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'దృశ్యం 3' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే భారత్‌లో ఏకంగా రూ.175 కోట్లు కొల్లగొట్టి, రూ.200 కోట్ల క్లబ్ దిశగా అత్యంత వేగంగా పయనిస్తోంది. ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, శ్రియ, ఇషితా దత్తా, టబు, రజత్ కపూర్, జైదీప్ అహ్లావత్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించగా.. అలోక్ జైన్, అజిత్ అంధారే, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ సంయుక్తంగా నిర్మించారు.

# 'రామాయణ' సెట్‌లో భారీ అగ్నిప్రమాదం

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్, టాలెంటెడ్ హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబైలోని గోరేగావ్ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో చిత్రబృందానికి ఊహించని షాక్ తగిలింది. సోమవారం మధ్యాహ్నం 4:02 గంటలకు ఫిల్మ్ సిటీలోని రిలయన్స్ మీడియా వర్క్స్, ప్రైమ్ ఫోకస్ వెనుక భాగంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ముంబై ఫైర్ విభాగం వెల్లడించింది. ప్రైమ్ ఫోకస్ స్టూడియో వెనుక ఉన్న వంద అడుగుల తాత్కాలిక సెట్‌లోని పీసీఆర్ యూనిట్‌లో ఈ మంటలు చెలరేగాయి. ఎలక్ట్రిక్ వైరింగ్, కేబుల్స్, తలుపులు, చెక్కపలకలు, ఏసీ యూనిట్లు, బాంబులు, ప్లాస్టిక్ సామగ్రి, సౌండ్ సిస్టమ్స్, షూటింగ్ పరికరాలు ఈ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ముంబై ఫైర్ సిబ్బంది, పోలీసులు, బీఎంసీ వార్డ్ కంట్రోల్, 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రం 4:55 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. 'రామాయణ' సెట్టే కాకుండా, పక్కనే ఉన్న స్టూడియోలలో షూటింగ్ జరుపుకుంటున్న ఎంటీవీ 'హస్టిల్ 5', 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్లు కూడా ఈ ప్రమాదం కారణంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్‌లో మొదలైన మంటలు క్రమంగా 'హస్టిల్ 5' సెట్ వైపు కూడా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు సెట్లకు ఎంత మేర నష్టం వాటిల్లిందనే దానిపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.





# మూడు బ్రేకప్స్.. ఆసుపత్రి పాలయ్యా

### సుప్రీత సంచలన నిజాలు!

**హైదరాబాద్, అక్టోబర్ 5 (స్పంద న్యూస్):** ప్రముఖ నటి సురేఖ వాణి కుమార్తెగా సినీ లోకానికి పరిచయమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుప్రీత తన వ్యక్తిగత జీవితంపై సంచలన విషయాలను వెల్లడించారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తన ప్రేమకథలు, ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభ, ఆరోగ్య సమస్యల గురించి భావోద్వేగంగా పంచుకున్నారు. తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపారు. చిన్నతనంలో కలిగిన మొదటి క్రష్‌ను తాను సీరియస్‌గా తీసుకోలేదని, అయితే రెండో రిలేషన్‌షిప్ మాత్రం తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఆ బంధం తనకు ఎంతో మానసిక వేదనను (ట్రామా) మిగిల్చిందని, ఆ ప్రభావంతో ఇప్పటికీ జన సమూహాల్లోకి వెళ్లినప్పుడు భయాందోళనలు, కంగారు కలుగుతుంటాయని చెప్పారు. ఆ మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రస్తుతం వైద్యుల సలహాతో మందులు కూడా వాడుతున్నట్లు వెల్లడించారు. ఇక మూడో రిలేషన్‌షిప్‌లో ఎదురైన చేదు అనుభవాలను వివరిస్తూ.. భాగస్వామిలోని తీవ్రమైన అనుమానం, ఈగో తట్టుకోలేకపోయానని సుప్రీత చెప్పారు. షూటింగ్ ప్రాంతాల్లో ఎవరితో మాట్లాడుతున్నావ్? ఎందుకు మాట్లాడుతున్నావ్? అంటూ వేధించేవారని, నియంత్రించే ఈ ధోరణి తన కెరీర్‌పై కూడా ప్రభావం చూపడంతో ఆ బంధం నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. వరుస బ్రేకప్స్ వల్ల తీవ్ర ఒత్తిడికి గురై బరువు గణనీయంగా 52 కిలోలకు తగ్గిపోయానని, ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించడానికి మెడిటేషన్, క్రమమైన చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే
స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 6 అక్టోబర్ 2026

## గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

### పల్లె పండుగ 3.0 లో ఎమ్మెల్యే మద్దులూరి



చీరాల అక్టోబర్ 5 ( స్పందన్యూస్ ): నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్పష్టం చేశారు. పల్లె పండగ 3.0 లో భాగంగా సోమవారం స్థానిక రూరల్ మండలం ఈపురుపాలెం గ్రామం నందు 30 లక్షల రూపాయలతో నిర్మించబోతున్న సీసీ రోడ్లకు సిండికేట్ వీవర్స్ కాలనీ నందు శంకుస్థాపన చేసిన సందర్భంలో శాసనసభ్యులు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, గ్రామీణ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.పల్లెల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు,అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాల్లో అగ్నిమాపక భద్రతపై రూరల్ ఎస్.ఐ అవగాహన



చిలకలూరిపేట అక్టోబర్5 : చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాణసంచా (క్రాకర్) దుకాణాలను రూరల్ ఎస్.ఐ జి. అనిల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన షాపు యజమానులు, సిబ్బందికి అగ్నిమాపక భద్రతా నిబంధనలపై (ఫైర్ సేఫ్టీ) విస్తృత అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని ఈ సందర్భంగా దుకాణదారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## నేటి నుంచి సేవ సేతు అభియాన్ కార్యక్రమం




చిలకలూరిపేట అక్టోబర్ 5 : ఈరోజు నుంచి అనగా 6,7,8 తారీఖు లో జాతీయ రహదారి లోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న గ్రాండ్ వెంకటేష్ పంక్షన్ హాలు నందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యాఘరు స్కీమ్ కింద సోలార్ విద్యుత్ వినియోగము, సబ్సిడీ గురించి వినియోగదారులకు అవగాహన కల్పించుటకు సేవా సేతు అభయాన్ అనే కార్యక్రమము నిర్వహించబడును ఆ కార్యక్రమంలో చిలకలూరిపేట టౌన్ 1, టౌన్ 2, రూరల్ చిలకలూరిపేట, ఎడ్లపాడు, గణపవరం విద్యుత్ అధికారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు పాల్గొని ప్రధానమంత్రి సూర్యాఘర్ కింద సోలార్ రిజిస్ట్రేషన్, బ్యాంక్ సబ్సిడీ గురించి అవగాహన మరియు అక్కడే స్పాట్ రిజిస్ట్రేషన్ బ్యాంక్ లోన్ అప్రూవల్ చేయించబడును కావున నియోజకవర్గ విద్యుత్ వినియోగదారులు ఈ సేవా సేతు అభయాన్ కార్యక్రమము లో పాల్గొని సోలార్ విద్యుత్ తో విద్యుత్ ఆదా చేసుకొని భావితరాలకు బంగారు వెలుగులు పంచుదామని చిలకలూరిపేట విద్యుత్ శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. ఏడుకొండలు తెలియజేశారు.

## ఉచిత సద్ది కార్యక్రమం మొదలు

గురజాల, అక్టోబర్ 5(స్పంద న్యూస్ ):గురజాల పట్టణంలోని వాగ్దేవి కాలేజీ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ఆవరణంలో ఉచిత సద్ది కార్యక్రమం మొదలయింది అని మాల దారులు వినియోగించుకోవాలి అని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ట్రస్ట్ వారు తెలియ చేసారు.అయ్యప్ప దీక్ష స్వీకరించిన,వివిధ మాలలు ధరించిన స్వాములకు ప్రతిరోజూ ఉచితంగా సద్దిని అందించుటకు ట్రస్ట్ నిర్ణయించింది. ఈ సేవా కార్యక్రమం దీక్షా కాలం ముగిసే వరకు కొనసాగుతుంది.కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలియజేయడమైనదని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ట్రస్ట్ వారు తెలిపారు.



# పి.జి.ఆర్.ఎస్‌కు 595 అర్జీలు






గుంటూరు, అక్టోబర్ 5 స్పంద న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో 595అర్జీలు అందాయి. సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. వయోవృద్ధులు, దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారు సంతృప్తి మేరకు పరిష్కారం కావాలని, సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. అర్జీలు పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 595 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 360, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 159 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 8 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 34 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 26, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 8 అర్జీలు అందాయి. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఎ.పిఎం.ఐ.పి ఎల్. వజ్రశ్రీ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, సర్వ శిక్షా అభియాన్ ఎపిసి పద్మావతి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పట్టాతో 75 సెంట్ల భూమి విక్రయం

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం..

### రీసర్వేలో తమ పేర్లే ఉన్నాయని వెల్లడి

చౌడేపల్లి, అక్టోబరు 5, స్పంద న్యూస్ : అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలం ఏ.కొత్తకోటకు చెందిన నర్సింహులు కుమారుడు భరత్‌కుమార్ తమ కుటుంబానికి చెందిన 75 సెంట్ల భూమిని నకిలీ పట్టా సృష్టించి ఇతరులకు విక్రయించారని ఆరోపించారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సోమవారం తెలిపారు. భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ కుటుంబం గత 50 ఏళ్లకు పైగా సర్వే నంబరు 206/6లోని భూమిని సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు జేసీబీతో భూమిని శుభ్రం చేసేందుకు రావడంతో వారిని ప్రశ్నించగా, ఈ భూమిని ఎస్.ఖలేందర్ విక్రయించినట్లు వారు తెలిపారని పేర్కొన్నారు.






### రీసర్వేలో తమ పేర్లే ఉన్నాయన్న భరత్‌కుమార్

ఇటీవల తమ సమక్షంలో జరిగిన రీసర్వేలోనూ సదరు భూమికి సంబంధించి తమ కుటుంబ సభ్యుల పేర్లే నమోదయ్యాయని భరత కుమార్ తెలిపారు. అయినప్పటికీ నకిలీ పట్టా సృష్టించి భూమిని విక్రయించినట్లు ఆరోపిస్తూ కలెక్టర్‌ను ఆశ్రయించినట్లు చెప్పారు.

### రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి

భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, పట్టా పత్రాలు, రీసర్వే వివరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని భరత్‌కుమార్ కోరారు. తమ కుటుంబానికి చెందిన భూమిని తమకు అప్పగించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. భూమి యాజమాన్యంపై తలెత్తిన వివాదంలో రెవెన్యూ రికార్డులు, రీసర్వే వివరాలు, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పుంగనూరు ప్రజలపై కక్ష వద్దు..

## తాగునీరు ఇవ్వాలి : ఎంపీ మిథున్‌రెడ్డి

### నీరు ఉన్నప్పుడే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపాలి

### రానున్న నెలల్లో తాగునీటి సమస్య తీవ్రతరం

### కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్

పుంగనూరు, అక్టోబరు 5, స్పంద న్యూస్ :పుంగనూరు పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును తక్షణమే నీటితో నింపాలని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పుంగనూరులో పర్యటించిన ఆయన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు.ఈ సందర్భంగా హంద్రీ-నీవా జలాల అంశంపై ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పుంగనూరు, మదనపల్లె, పలమనేరు, కుప్పం ప్రాంతాలకు ఐదేళ్లపాటు నీటిని అందించామని తెలిపారు. ప్రస్తుతం నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పుంగనూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపకుండా కృష్ణా జలాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు.



### తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పుంగనూరు ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో రానున్న మూడు, నాలుగు నెలల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. నీరు అందుబాటులో ఉన్న సమయంలోనే పుంగనూరు, మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపి ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ప్రాథమిక అవసరాల్లో తాగునీరు అత్యంత ముఖ్యమైనదని, నీటి విషయంలో ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.



### రాజకీయ కక్షలు ప్రజలపై ఉండకూడదు

రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, అయితే వాటి ప్రభావం ప్రజలపై పడకూడదని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. “రాజకీయ కక్షలు ఉండొచ్చు.. ప్రజలపై కక్ష ఉండకూడదు” అని పేర్కొంటూ పుంగనూరు ప్రజల తాగునీటి అవసరాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, నీటి లభ్యత ఉన్న సమయంలోనే అవసరమైన నిల్వలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, పుంగనూరు మున్సిపల్ మాజీ చైర్మన్ అలీమ్ భాష, కొండవీటి నాగభూషణం, ఫక్రుద్దీన్ షరీఫ్, వెంకట్‌రెడ్డి యాదవ్, రాజేష్ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ పథకంపై ప్రత్యేక రిజిస్ట్రేషన్ శిబిరాలు

**గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సేవా సేతు అభియాన్ ఆధ్వర్యంలో శిబిరాలు**

**గరిష్టంగా రూ.78 వేల వరకు సబ్సిడీ..**

**వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారుల విజ్ఞప్తి**

గుంటూరు, అక్టోబరు 5, స్పంద న్యూస్ : విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ (ప్రీ ాబతీఋ +ఘ్రుతీ: వీబట్ దీఅయ్ర్‌శ్రీఅ ౕశీయిఋఋ) పథకంపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రత్యేక అవగాహన, రిజిస్ట్రేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. సేవా సేతు అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు దరఖాస్తు ప్రక్రియ, సబ్సిడీ, రుణ సదుపాయాలు, సాంకేతిక అంశాలపై ప్రత్యక్షంగా సమాచారం అందించనున్నారు.

శిబిరాల తేదీలు.. ప్రాంతాలు

అక్టోబరు 6: కృష్ణానగర్ (ఙ-8), గుంటూరు అక్టోబరు 7: గోరంట్ల (ఙ-7), గుంటూరు అక్టోబరు 8: గుజ్జనగుండ్ల (ఙ-4), గుంటూరు, వికాస్‌నగర్ (ఙ-11), గుంటూరు అదేవిధంగా అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు గుంటూరు నల్లచెరువులోని ఓ లైన్ విద్యుత్ కార్యాలయంలో కూడా దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.




రూ.78 వేల వరకు సబ్సిడీ

పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు విద్యుత్ లోడ్ సామర్థ్యాన్ని బట్టి ఆర్థిక సహాయం లభిస్తుంది.

- 1 కిలోవాట్ వరకు -- రూ.30,000
- 2 కిలోవాట్ల వరకు -- రూ.60,000
- 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ -- గరిష్టంగా రూ.78,000అర్హతలు, సబ్సిడీ నిబంధనలు, వ్యవస్థ సామర్థ్యం తదితర అంశాల ఆధారంగా ప్రయోజనం లభిస్తుందని అధికారులు తెలిపారు.

ఒకే చోట దరఖాస్తు.. రుణం, సాంకేతిక సలహాలు

ఈ ప్రత్యేక శిబిరాల్లో సోలార్ వెండార్లు, బ్యాంకర్లు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొంటారు. దీంతో వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు రుణ సదుపాయాలు, పరికరాల ఏర్పాటు, సాంకేతిక వివరాలపై నేరుగా సలహాలు పొందే అవకాశం ఉంటుంది. సులభతరమైన దరఖాస్తు ప్రక్రియను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఎక్కువ మంది విద్యుత్ వినియోగదారులు పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నారు.

**విద్యుత్ బిల్లుల తగ్గింపునకు అవకాశం**

ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా సౌర విద్యుత్‌ను వినియోగించుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. వినియోగానికి మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు సంబంధించిన నిబంధనల మేరకు ప్రయోజనం పొందే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు చేసిన పెట్టుబడి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి, బిల్లుల ఆదా తదితర అంశాలపై ఆధారపడి కాలక్రమేణా తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు.

**వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.వి. సుబ్బారావు, ఆపరేషన్ టౌన్-3, గుంటూరు, అలాగే ఆపరేషన్ టౌన్-2 అధికారులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించే ఈ పథకం ద్వారా అర్హులైన వినియోగదారులు ప్రయోజనం పొందాలని వారు కోరారు.

# 10 నెలల శిక్షణ పూర్తి చేసిన పోలీస్ డాగ్ 'రీటా'



కృష్ణా జిల్లా, అక్టోబరు 5, స్పంద న్యూస్ : కృష్ణా జిల్లా పోలీస్ శాఖకు చెందిన ఫీమేల్ బెల్జియన్ మాలినోయిస్ పోలీస్ డాగ్ 'రీటా' మంగళగిరి సీటీసీలో 10 నెలల ప్రత్యేక నార్కోటిక్ డిటెక్షన్ అండ్ ట్రాకింగ్ శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ రీటాతో పాటు దాని హ్యాండ్లర్ హెచ్‌సీ 1451 టి. భూషయ్యను అభినందించారు. మాదకద్రవ్యాలు, అనుమానాస్పద పదార్థాలను గుర్తించడం, వాటి ఆనవాళ్లను ట్రాక్ చేయడంలో రీటా సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. రీటా ఆరోగ్యం, ఆహారం, విశ్రాంతి, సంరక్షణపై హ్యాండ్లర్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ డాగ్‌ల సేవలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, ఇతర పోలీస్ అధికారులు, కృష్ణా జిల్లా ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులుగా మాశెట్టి

**-నియమాక పత్రం అందించిన శ్రీనివాస్ గుప్తా**

**-ఆర్యవైశ్య విద్య, అభివృద్ధి కోసం కృషి**

**-మాశెట్టి బుజ్జి.**

దాచేపల్లి, అక్టోబరు 5(స్పంద న్యూస్): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గా దాచేపల్లి పట్టణానికి చెందిన మాశెట్టి వెంకటేశ్వర్లు (బుజ్జి )ని నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం దాచేపల్లి లో జరిగిన సమావేశంలో ఐవిఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్,తెలంగాణ ఐవిఎఫ్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాశెట్టి బుజ్జి కి నియమాక పత్రం అందించారు. జిల్లా లో ఆర్యవైశ్యుల విద్య, వైద్యం అభివృద్ధి కి కృషి చేయాలని అదేవిదంగా రాజకీయ చైతన్యం తీసుకురావాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా బుజ్జి కి సూచించారు. ఆర్యవైశ్యులు ధనవంతులు అనే ముద్ర సమాజం లో ఉందని, అయితే ఆర్యవైశ్యులలో కూడా పూట గడవని వాళ్ళు చాలామంది ఉన్నారని, పేదరికం లో ఉన్నవారిని గుర్తించి అర్థికంగా అభివృద్ధి చేయాల్సిన భాధ్యత మనపై ఉందని శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఈ కార్యక్రమానికి దాచేపల్లి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాల నాయకులు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో దాచేపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవరశెట్టి రమేష్ , టౌన్ అధ్యక్షులు చింతా వెంకటేశ్వర్లు మాశెట్టి పుల్లారావు మాశెట్టి సాత్విక్ , అప్పారావు, గురువులు, రాంబాబు, సుబ్బారావు, మురళీ, కృష్ణమూర్తి , గురుప్రసాద్, రాధా , చంద్రం , రామకృష్ణ గాంధీ , భాస్కరరావు ఆంజనేయులు , కిషోర్, కోటేశ్వరరావు లక్ష్మీనారాయణ , నరేష్ , శ్రీను తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాశెట్టి బుజ్జి మాట్లాడుతూ




**ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామన్నారు.**

పల్నాడు జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులుగా తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్యుల సంక్షేమం, విద్య, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని మాశెట్టి వెంకటేశ్వర్లు (బుజ్జి) తెలిపారు.

# పూర్తి చేసిన పనుల బిల్లులు తక్షణం అప్ లోడ్ చేయాలి



గుంటూరు, అక్టోబర్ 5 స్పంద న్యూస్ : విబి జి రామ్ జి పథకం కింద పూర్తి చేసిన పనుల బిల్లులు శుక్రవారం నాటికి అప్ లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. వివిధ శాఖల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విబి జి రామ్ జి క్రింద కొన్ని మండలాల్లో మంజూరు చేసిన పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం పట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ప్రశ్నించారు. ముందుగానే గుర్తించినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పల్లె పండగ 3.0 క్రింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాపై స్పష్టమైన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడా తాగు నీటి ప్రమాణాలకు విరుద్ధమైన విలువలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో అందిన అర్జీలపై స్పష్టమైన విచారణ చేపట్టి అర్జీదారు సంతృప్తి మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని చిన్నారులకు త్వరితగతిన నమోదు చేయాలని స్పష్టం చేశారు. నైపుణ్య శిక్షణకు గ్రామీణ యువత నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎం.పి.డి.ఓలు ఇందులో క్రియాశీలంగా వ్యవహరించాలని చెప్పారు. డి.డి.యు - జి.కె.యు క్రింద శిక్షణ, ప్లేస్మెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు అమలులో ప్రజలకు సంతృప్తికరంగా ఉండేందుకు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా ఉపాధి అధికారి ఎం. క్రిస్టీ అభినవ్, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు ఆంజనేయులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు ఎస్. వెంకట రావు, జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యు అధికారి ఆర్.రామలింగేశ్వర రెడ్డి, ఎస్.జి.ఎస్.డబ్ల్యు సమన్వయ అధికారి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# పట్టణంలో అధ్వానంగా పారిశుధ్యం

**పట్టించుకోని శానిటేషన్ అధికారులు**

**దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జిలాని ఆరోపణ**



చీరాల అక్టోబర్ 5( స్పంద న్యూస్ )

పట్టణంలో ( పారిశుధ్యం) డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా మారిందని దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జిలాని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు సైతం నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయని తెలిపారు. సంబంధిత అధికారులు సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధ్వానంగా మారిన పారిశుద్ధ్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మసీదు సెంటర్ నుంచి కొత్తపేటకు వెళ్లే మార్గంలో కొంతకాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని జిలాని అన్నారు. డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ సమస్యలపై స్థానిక శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ప్రత్యేకంగా దృష్టి సారించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ, మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డేనియల్‌కు జిలాని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు, దళిత బహుజన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుంటూరు జీజీహెచ్‌లో అనుమానాస్పద మృతి

**చికిత్స కోసం చేరిన వ్యక్తి మృతి..**

**మృతదేహాన్ని ఆసుపత్రి వెలుపలికి తరలించినట్లు సమాచారం**

**ఘటనపై పోలీసుల విచారణ.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది**



గుంటూరు, అక్టోబరు 5,స్పంద న్యూస్ : గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్)లో చికిత్స కోసం చేరిన ఓ వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ముగ్గురు గార్డులు కలిసి ఆసుపత్రి వెలుపలికి తీసుకువచ్చి అక్కడ వదిలివేసినట్లు సమాచారం.

ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, మృతదేహం ఆసుపత్రి వెలుపల కనిపించడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

సంఘటనా స్థలానికి పోలీసులు

ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వివరాలు, ఆసుపత్రిలో ఎప్పుడు చికిత్స కోసం చేరారు, ఏ కారణంతో మృతి చెందారు అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**గార్డుల పాత్రపై విచారణ**

మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి బయటకు తీసుకువచ్చినట్లు వస్తున్న సమాచారంపై కూడా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ముగ్గురు గార్డులు మృతదేహాన్ని ఎందుకు బయటకు తరలించారు? ఆసుపత్రి సిబ్బంది అనుమతి ఉందా? మృతదేహాన్ని తరలించాల్సిన పరిస్థితి ఏమిటి? అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

**పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది**

మృతికి అసలు కారణం ఏమిటి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఏం జరిగింది, మృతదేహాన్ని ఆసుపత్రి వెలుపలికి ఎందుకు తరలించారు అనే విషయాలపై అధికారికంగా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది. పోలీసుల విచారణ అనంతరం ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# రాష్ట్ర స్థాయి రెడ్‌క్రాస్ శిక్షణకు టీజేపీఎస్ కళాశాల విద్యార్థులు ఎంపిక

**చిత్తూరులో అక్టోబరు 14 నుంచి 16 వరకు శిక్షణ శిబిరం**

గుంటూరు, అక్టోబరు 5, స్పంద న్యూస్ : చిత్తూరులో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరానికి టీజేపీఎస్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కే. వైష్ణవి భాయి, ఎస్‌కే పర్వీన్, పి. సిద్ధార్థ ప్రణవశాస్త్రి, పి. షణ్ముఖ ప్రసాద్ శర్మ ఈ శిక్షణకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణ, ఆరోగ్యం--పరిశుభ్రత, సామాజిక సేవ, రోడ్డు భద్రత, నాయకత్వ లక్షణాలు, అభివ్యక్తి నైపుణ్యాలు, రక్తదానంపై అవగాహన తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

**సామాజిక సేవలో యువత భాగస్వామ్యం అభినందనీయం**

గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జై.వీ. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత విద్యతో పాటు సామాజిక అంశాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో బాధ్యత, నాయకత్వ లక్షణాలు మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరానికి ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం అభినందించారు.



# సత్తెనపల్లి టౌన్ సీఐగా సిహెచ్. ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ



సత్తెనపల్లి, అక్టోబరు 5, స్పంద న్యూస్ :పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సిహెచ్. ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో శాంతిభద్రతలను కాపాడటమే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖఅందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలుపట్టణంలో గంజాయి, అక్రమ మద్యం, పేకాటతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

**ప్రజలు సహకరించాలి**

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని సీఐ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజలు, వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తామని సీఐ సిహెచ్. ప్రభాకర్ తెలిపారు.

**మహిళ హత్య కేసులో నిందితులను**

# అరెస్టు చేసిన కారంపూడి పోలీసులు



కారంపూడి, అక్టోబర్ 5,( పల్నాడు జిల్లా) స్పంద న్యూస్ :- మండల కేంద్రమైన కారంపూడిలో ఈ నెల 1వ తేదీన జరిగిన మహిళ దారుణ హత్య కేసులో ముగ్గురు నిందితులను కారంపూడి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆవుల భాస్కర్, ఎస్సై వాసు అరెస్టు చేసి దర్యాప్తు చేయగా, నిందితులు రామావత్ బాబా నాయక్, రామావత్ మల్లికా భాయ్ అలియాస్ గుంజా మల్లికా, రామావత్ సీతా భాయ్ కలసి శ్రీలక్ష్మి బాయ్ తో గొడవపడి ఆమెపై ముగ్గురు కలిసి మూకుమ్మడిగా దాడి చేయగా, లక్ష్మీబాయి మరణించిందని,ఆ తర్వాత వీరందరూ కలిసి లక్ష్మీబాయి శవాన్ని బెడ్ రూమ్ లోకి తీసుకువెళ్లి చీరను సీలింగ్ ఫ్యాన్ కు వేసి కట్టి లక్ష్మీబాయి శవాన్ని వేలాడదీసి ఆత్మహత్య వేసుకున్నట్లుగా సృష్టించి ఆ ఇంటి తలుపులకు బయట తాళం వేసి వెళ్ళిపోయినట్లుగా పోలీసువారి దర్యాప్తులో ముగ్గురు నిందితులు ఒప్పుకున్నట్లుగాను, అలా చేయటం వల్ల ఎప్పటి నుండో శ్రీ లక్ష్మీబాయితో బంగారం విషయంలోనూ తరువాత ఆమె చనిపోతే స్థిరాస్తులలో ఆమె వాటా కూడాతనకే చెందుతుందని బాబా నాయక్ పథకం వేసి మల్లికాను, శ్వేతా భాయ్ లను కలుపుకొని శ్రీలక్ష్మిని హత్య చేసినట్లుగా దర్యాప్తులో వెల్లడించారు.

రామావత్ బాబా నాయక్ పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయని కారంపూడి లో కూడా మహిళను అత్యాచారం చేసి చంపిన కేసులో రిమాండ్పై జైలు శిక్ష అనుభవిస్తూ, బెయిల్ పై వచ్చి మరల బంగారం మరియు స్థిరాస్తుల కొరకు పథకం ప్రకారం హత్య చేశాడని, ఈ ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా వారిని రిమాండ్ కు పంపించినట్లుగా కారంపూడి పోలీసు వారు తెలియజేశారు.

ప్రజాగళమే
# స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
మంగళవారం, 6 అక్టోబర్ 2026

## మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్ళిన చైన్ స్నాచర్లు



చిలకలూరిపేట అక్టోబర్ 5 స్పంద న్యూస్ : పట్టణంలోని పురుషోత్తపట్నంలోపసుపులేటి గీత ఇంట్లో ఉండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి మెడలో ఉన్న బంగారు చైన్‌ను బలవంతంగా లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారైనరు.ఘటనపై సమాచారం అందుకున్న అర్బన్ సీఐ పి. రమేష్, ఎస్ఐ హాజరతయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.బాధితురాలు గీత నివాసం వద్ద ఘటనకు సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.చైన్ స్నాచర్ల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

**కూటమి కార్యకర్తల జోలికొస్తే 70 ఎంఎం సినిమా చూపిస్తా..**

## నా కొడకల్లారా

**-ఎమ్మెల్యే యరపతినేని**



దాచేపల్లి, అక్టోబరు 5(స్పంద న్యూస్ ): కూటమి లోని మూడు పార్టీల కార్యకర్తల జోలికొస్తే 70 ఎంఎం సినిమా చూపిస్తా.. నా కొడకల్లారా అంటూ పరుష పదజాలం తో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైసిపి నాయకులపై విరుచుకుపడ్డారు. పల్నాడు జిల్లా , దాచేపల్లిలోని పివిఆర్ కన్వేషన్ లో సోమవారం కూటమి నాయకుల సమావేశంలో పాల్గోన్న ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేము వస్తే రప్ప రప్ప నరుకుతాం.. ఏదో పొడుస్తాం అంటున్న ఒక్కొక్క వైసిపి నా కొడుకుని రోడ్డుమీద గుడ్డలూడదీసి కొడతాం. ఖబర్దార్ అంటూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని హెచ్చరించారు. పల్లెటూరులో పెరిగిన వాడిని. ఈ చేత్తో వ్యవసాయం చేయడం తెలుసు.. బాంబులు చుట్టడం తెలుసు.. ఈ భుజంతో తుపాకులు మోయడం తెలుసు అని అగ్రహావేశాలు వ్యక్తం చేశారు.నన్ను యరపతినేని శీనుగా ఉంచండి దయచేసి.. మంచి కళ్ళు శీనుగా చేయొద్దు.. అంటూ ప్రత్యర్థి వర్గాలను హెచ్చరించారు. మా కూటమి కార్యకర్తల జోలికి వస్తే వైసీపీ వాళ్లకు 70 ఎంఎం సినిమా చూపిస్తా" అని యరపతినేని శ్రీనివాసరావు తీవ్ర హెచ్చరిక చేశారు.కూటమి కార్యకర్తలకు అండగా ఉంటానని, కార్యకర్తలపై దాడులు , బెదిరింపులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కూటమి నాయకులకు యరపతినేని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో దాచేపల్లి మండల మూడు పార్టీల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ**




నరసరావుపేట, అక్టోబర్ 05 (స్పంద న్యూస్):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, 100% గ్రాస్ వేతనాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్లకు, వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 14,600 మంది స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ అధికారులు, ఇతర పారామెడికల్ కాంట్రాక్ట్ సిబ్బంది ఏళ్ల తరబడి ప్రజలకు నిరంతరాయంగా అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారు. గత 16 సంవత్సరాలుగా పారామెడికల్ పోస్టులకు సరిపడా రెగ్యులర్ నియామకాలు చేపట్టకపోవడంతో పూర్తి అర్హతలు మరియు అపార అనుభవం ఉన్న సిబ్బంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే ఉండిపోవాల్సి వచ్చిందని జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికే ఉన్నతాధికారులకు విన్నవించినా స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఈ వినతిపత్రాన్ని సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జేఏసీ తమ ప్రధాన డిమాండ్లను ప్రస్తావిస్తూ దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రస్తుత కాంట్రాక్ట్ ఉద్యోగుల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని తక్షణమే వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని కోరింది.

పే,డీఏ,హెచ్ఆర్ఏ కలిపి 100% గ్రాస్ జీతాన్ని పునరుద్ధరించాలని, అలాగే 2018 నుంచి అమల్లోకి వచ్చిన వేతన తగ్గింపుపై పునఃసమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. భవిష్యత్తులో కొత్త ఖాళీలకు రెగ్యులర్ నోటిఫికేషన్లు జారీ చేసే సమయంలో ప్రస్తుతం పనిచేస్తున్న అర్హులైన సిబ్బందికి ప్రాధాన్యత కల్పించాలని, జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి నిర్దిష్ట గడువుతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం నుంచి తగిన స్పందన రాని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేయనున్నట్లు జేఏసీ స్పష్టం చేసింది. దీనిలో భాగంగా అక్టోబర్ 4న ఆన్‌లైన్ వర్క్ ఏ పెన్ డౌన్ నిరసన, అక్టోబర్ 5న జిల్లా కలెక్టర్లకు శాంతియుత నిరసనల ద్వారా వినతిపత్రాల సమర్పణ చేపట్టినట్లు వెల్లడించింది. అక్టోబర్ 6న అత్యవసర సేవలు, ఐసీయూ, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ మినహాయించి మిగిలిన సాధారణ విధులను బహిష్కరిస్తామని తెలిపింది. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 7న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ అధికారులు సహా పారామెడికల్ సిబ్బంది మొత్తం అత్యవసర సేవలతో సహా అన్ని రకాల సేవలను సంపూర్ణంగా బహిష్కరిస్తామని హెచ్చరించింది. రోగులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తూనే, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరింది.

## తెనాలిలో స్వర్ణ ఆంధ్ర పార్క్‌ను ప్రారంభించిన మంత్రి మనోహర్

తెనాలి, అక్టోబర్05: పురపాలక సంఘం పరిధిలోని ఐతానగర్‌లో సుమారు 3.50 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.14 కోట్లతో అభివృద్ధి చేసిన "స్వర్ణ ఆంధ్ర పార్క్"ను సోమవారం సాయంత్రం తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పార్కును సందర్శించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.213.90 లక్షలతో పార్కును సమగ్రంగా అభివృద్ధి చేశారు. తొలుత "ఫికస్ పార్క్"గా అభివృద్ధి చేసిన ఈ ప్రదేశానికి, ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణ ఆంధ్ర 2047 దిశగా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యానికి అనుగుణంగా "స్వర్ణ ఆంధ్ర పార్క్"గా నామకరణం చేశారు. వి.ఎస్.ఆర్ కళాశాల సమీపంలోని ఈ పార్కులో ప్రజల ఆరోగ్యం, వినోదం, క్రీడలు, పిల్లల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన అనేక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఓపెన్ ఎయిర్ యాంఫీథియేటర్, వ్యూ పాయింట్, నాలుగు గెజిబోలు, రెండు పార్కింగ్ ప్రాంతాలు, పిల్లల ఆట స్థలం, మాన్యువల్ చెస్ ప్లేయింగ్ ఏరియా, ఓపెన్ జిమ్, ఆక్యుప్రెషర్ వాకింగ్ విభాగం, లాన్ మౌండ్స్, టాయిలెట్ బ్లాక్స్, వాచ్‌మన్ గది వంటి వసతులను కల్పించారు. అదనంగా కృత్రిమ చెరువు, పికిల్‌బాల్ కోర్టు, అంతర్గత పేవర్ మార్గాలు, మడ్ వాకింగ్ ట్రాక్, పెయింటింగ్, విస్తృతమైన మొక్కల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్ పనులను చేపట్టారు.




పిల్లలకు వినోదంతో పాటు శారీరక, మానసిక వికాసానికి, పెద్దలకు వ్యాయామం, వాకింగ్‌కు ఉపయోగపడేలా పార్కును రూపొందించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు ఈ పార్కు ఒక చక్కటి ప్రజా వేదికగా నిలవనుంది. పచ్చదనం, ఆరోగ్యం, వినోదం, ప్రజా సౌకర్యాలను సమన్వయం చేస్తూ అభివృద్ధి చేసిన స్వర్ణ ఆంధ్ర పార్క్ తెనాలి పట్టణానికి మరో అందమైన హరిత వనంగా అందుబాటులోకి వచ్చింది.

## రూ.5.10 లక్షలకే సొంత ఇల్లు!

గుంటూరు, అక్టోబరు 5, స్పంద న్యూస్ : సొంత ఇల్లు.. ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబం కల. కానీ రోజురోజుకూ పెరుగుతున్న నిర్మాణ సామగ్రి ధరలు, కూలీల వ్యయం కారణంగా సొంతింటి నిర్మాణం అనేక కుటుంబాలకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో తక్కువ ఖర్చుతో, వేగంగా ఇళ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్‌లో కీలక అడుగు పడుతోంది. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో కేవలం రూ.5.10 లక్షలకే ఇల్లు నిర్మించే పైలట్ ప్రాజెక్టుకు రాష్ట్రంలో శ్రీకారం చుట్టనున్నారు.

రూ.5.10 లక్షలకే సకల సదుపాయాలు!

ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ 2.0 పథకంలో భాగంగా తొలిసారిగా 3డీ టెక్నాలజీని గృహ నిర్మాణంలో వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నారు. సాధారణంగా ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో ఇంటికి రూ.2.39 లక్షల వరకు సహాయం అందిస్తున్నాయి.

అయితే 3డీ టెక్నాలజీతో నిర్మించే నమూనా ఇళ్లకు అదనపు సహాయం అందించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.5.10 లక్షలుగా అధికారులు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యయంలోనే ఇల్లు, మెట్లు, ర్యాంప్, వాష్‌రూమ్ వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించనున్నారు.

బుర్రిపాలెంలో తొలి అడుగు.. 100 ఇళ్ల నిర్మాణం!

తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామాన్ని ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ ప్రాజెక్టు ఏపీకి వచ్చినట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీబీఆర్ఐ మధ్య అవగాహన ఒప్పందం కుదిరేలా చర్యలు చేపట్టారు. మొదటి దశలో బుర్రిపాలెంలో 100 త్రీడీ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సాంకేతికతను విస్తరించే అవకాశం ఉంది.

దివ్యాంగులకు ప్రత్యేకంగా 77 ఇళ్లు!

గుంటూరు రూరల్ పరిధిలోని ఓబుల్‌నాయుడుపాలెంలో మరో 77 ఇళ్లను దివ్యాంగుల కోసం ప్రత్యేక నమూనాలో నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ర్యాంప్‌లు, అనువైన ప్రవేశ మార్గాలు, అవసరమైన సదుపాయాలతో ఇళ్లను రూపొందించనున్నారు.

ఈ పైలట్ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.9.44 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.4.49 కోట్లు భరించనున్నట్లు సమాచారం.

రోబోటిక్ ఆర్మ్‌తో గోడలు.. కూలీల ఖర్చుకు భారీ కోత!

సంప్రదాయ పద్ధతిలో ఇల్లు నిర్మించాలంటే మేస్త్రీలు, కూలీలు ఎక్కువ సంఖ్యలో అవసరం. నిర్మాణం పూర్తయ్యే వరకు నెలల సమయం పడుతుంది. అయితే 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ విధానంలో భారీ రోబోటిక్ ఆర్మ్ ద్వారా ప్రత్యేక కాంక్రీట్ మిశ్రమాన్ని పొరలుగా వేస్తూ గోడలను నిర్మిస్తారు.

డిజైన్‌ను ముందుగానే సాఫ్ట్‌వేర్‌లో ప్రోగ్రామ్ చేయడంతో అవసరమైన చోట మాత్రమే కాంక్రీట్ వినియోగిస్తారు. దీంతో ముడిసరుకు వృథా తగ్గుతుంది. నిర్మాణ ప్రక్రియలో కొద్దిమంది టెక్నీషియన్ల పర్యవేక్షణ సరిపోవడంతో మానవ శ్రమకు సంబంధించిన వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంటుంది.

సెంట్రింగ్ ఖర్చు లేదు.. నిర్మాణ వేగం పెరుగుతుంది!

3డీ ఇళ్ల నిర్మాణంలో వేగంగా గట్టిపడే ప్రత్యేక కాంక్రీట్ మిశ్రమాలను వినియోగిస్తారు. దీంతో సంప్రదాయ నిర్మాణాల్లో అవసరమయ్యే సెంట్రింగ్, ఇతర సహాయక సామగ్రి వినియోగం తగ్గుతుంది.ముడిసరుకు, కూలీల శ్రమ, నిర్మాణ సమయం వంటి అంశాల్లో ఆదా సాధ్యమవుతుండటంతో మొత్తం వ్యయాన్ని నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు. సంప్రదాయ పద్ధతితో పోలిస్తే 3డీ ప్రింటింగ్ ద్వారా నిర్మాణ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని సాంకేతిక వర్గాలు చెబుతున్నాయి.



పైలట్ సక్సెస్ అయితే.. దేశవ్యాప్తంగా కొత్త మార్పు!

బుర్రిపాలెంలోని 100 ఇళ్లు, ఓబుల్‌నాయుడుపాలెంలోని 77 దివ్యాంగుల ఇళ్ల నిర్మాణం ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 3డీ సాంకేతికతతో నిర్మించిన ఇళ్ల నాణ్యత, నిర్మాణ వేగం, వ్యయ తగ్గింపు, లబ్ధిదారులకు అందించే సదుపాయాలను అంచనా వేయనున్నారు.

పైలట్ ప్రాజెక్టు ఆశించిన ఫలితాలను సాధిస్తే పేదల గృహ నిర్మాణ రంగంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీకి మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది. తక్కువ ఖర్చు.. వేగవంతమైన నిర్మాణం.. తక్కువ ముడిసరుకు వృథా అనే లక్ష్యాలతో ఈ విధానం ముందుకు సాగితే భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి నిర్మాణంలో కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం కనిపిస్తోంది.

## దళితులు కేవలం పన్నులు చెల్లించేందుకే పరిమితమా?

**మున్సిపల్ రిజర్వేషన్లలో ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించబోం: కోట సుబ్బు మాదిగ హెచ్చరిక**



నరసరావుపేట, అక్టోబర్ 05 (స్పంద న్యూస్): పల్నాడు జిల్లాలోని కీలకమైన చిలకలూరిపేట, నరసరావుపేట మున్సిపాలిటీల చైర్మన్ పీఠాలను రానున్న ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి షాలేం రాజుల ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ రెండు మున్సిపాలిటీల్లో ఎస్సీ రిజర్వేషన్ అంశాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా కోట సుబ్బు మాదిగ మాట్లాడుతూ పట్టణాల అభివృద్ధిలో ఎస్సీల పాత్ర ఎంతో కీలకమని, ఇంటి పన్ను, ఆస్తి పన్ను, నీటి పన్ను వంటివి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ.. పాలక, ప్రతిపక్ష పార్టీలు దళితులను కేవలం పన్నులు చెల్లించే ఓటర్లుగానే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా రాజకీయంగా దళితులను ఇంకా అంటరానివారిగానే చూస్తుండటం బాధాకరమన్నారు. చిలకలూరిపేట పురపాలక సంఘంలో గతంలో ఓసీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించిందని, సామాజిక న్యాయం ప్రకారం ఈసారి ఎస్సీలకే అవకాశం కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే నరసరావుపేట మున్సిపాలిటీలో ప్రధాన సామాజిక వర్గాలు అధికంగా ఉన్నప్పటికీ, ఇంతవరకు ఎస్సీలకు ఒక్కసారి కూడా అవకాశం ఎందుకు కల్పించలేదో రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కేటాయించి రాజకీయ న్యాయం చేయకపోతే, దళిత వాడల నుంచి తీవ్రస్థాయిలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్, నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు దేవదానం మాదిగ, మండల అధ్యక్షులు వేశపోగు తిమోతి మాదిగ (నరసరావుపేట), రేలంగి శ్యాంబాబు మాదిగ (రొంపిచర్ల), మరియాదాసు మాదిగ (ఈపూరు), వినుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పచ్చిగోళ్ళ సుధాకర్ మాదిగ, పట్టణ అధ్యక్షులు వేల్పుల రాంబాబు మాదిగ, మహిళా విభాగం నాయకురాలు రేపూడి శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సేవా సేతు అభియాన్ పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్



గుంటూరు, అక్టోబర్ 5 స్పంద న్యూస్ : "సేవా సేతు అభియాన్" పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ -- ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా "సేవా సేతు అభియాన్" క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. "ప్రతి ఇంటికి సౌర విద్యుత్‌ను చేరువ చేయడం, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే సేవా సేతు అభియాన్ ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు. ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు.

రూ.78 వేల వరకు సబ్సిడీ

పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు:

1 కిలోవాట్‌కు రూ.30,000

2 కిలోవాట్లకు రూ.60,000

3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు."సేవా సేతు అభియాన్" క్యాంపుల ద్వారా ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ పొందే ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ క్యాంపుల్లో బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొని వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పథకం అమలుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందిస్తారని చెప్పారు.ప్రతి ఇంటినీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమే లక్ష్యం అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తన ఇంటినే విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## దివ్యాంగురాలి పై అత్యాచారం కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు

**రూ.5,000/- జరిమానా**
**బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం**

చీరాల అక్టోబర్ 5 ( స్పంద న్యూస్ ): న్యాయస్థానాల్లో నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకునేందుకు ప్రతి కోర్టుకు ఒక డెడికేటెడ్ కానిస్టేబుల్‌ను నియమించి, జిల్లా కేంద్రంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోర్టు లైజనింగ్ సెల్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రయల్స్‌ను పర్యవేక్షిస్తూ, నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ తెలిపారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మహిళా భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంబంధిత కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఆపరేషన్ దండాయన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.అందులో భాగంగా, 2023 సంవత్సరంలో బాపట్ల జిల్లా చీరాల ×× టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని దివ్యాంగురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5,000/- నగదు జరిమానా విధిస్తూ సోమవారం ఒంగోలు 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి పందిరి లలిత తీర్పు వెలువరించారు. అదేవిధంగా, బాధితురాలికి రూ.5,00,000/- నష్టపరిహారం అందేలా జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నిందితుడి వివరాలు: గుత్తి శీను, తా/శీ సుబ్రహ్మణ్యం, వయస్సు 24 సంవత్సరాలు, దేవాంగ కులం, భావనారుషి పేట, ఇపురుపాలెం గ్రామం.

**కేసు వివరాలు**

22.10.2023 న ఫిర్యాదుదారు కూలి పనుల నిమిత్తం బిర్యానీ షాపుకు వెళ్లారు. ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో, శారీరక వైకల్యంతో బాధపడుతున్న తన కుమార్తెను ఆమె కుమారుడు ఇంట్లో ఉండి చూసు కుంటున్నాడు. సాయంత్రం సుమారు 06.00 గంటల సమయంలో ఫిర్యాదుదారు కుమారుడు ఏడుస్తూ పరుగెత్తుకుంటూ వచ్చి, ఒక వ్యక్తి ఇంట్లోకి వచ్చి తన అక్కతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదుదారుకు తెలపగా, ఫిర్యాదుదారు వెంటనే ఇంటికి వెళ్లి చూడగా, నిందితుడు గుత్తి శీను బాధితురాలిపై అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించి గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు.

**జిల్లా ఎస్పీ అభినందనలు**

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బంది, ట్రయల్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన కోర్టు లైజనింగ్, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని, అలాగే ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతమైన వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి అవనీష్ చేసిన కృషిని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ అభినందించారు.